జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 20 పక్షపత్రిక అక్టోబర్ 16-31, 2016








# వార్నింగ్ హైదరాబాద్ !

## స్మార్ట్ సిటీల భ్రమల్లోనే లక్షల కోట్లు ఋణంగా పెడదామా?

## కనీసవసతులు - వార్డుల్లోకి పాలన - 10,000 చిన్న పట్టణాల వాస్తవంలోకొద్దామా?



లోక్‌సత్తా పార్టీ
ఏపీ నూతన అధ్యక్షుడిగా భీశెట్టి బాబ్జీ



# జాతీయ విద్యావిధానం ముసాయిదాపై యూత్ పార్లమెంట్ సవరణలు - జేపీ సూచనలు






మహాత్మాగాంధీ జన్మదినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదాపై నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో జేపీ పాల్గొన్నారు. ప్యానల్ చర్చలో వివిధ యువ సంస్థల ప్రతినిధులు ప్రతిపాదించిన సవరణలపై సూచనలిచ్చారు. ప్రతినిధుల అభిప్రాయాలపై చర్చించటంతోపాటు వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అందరికీ నాణ్యమైన విద్య లక్ష్యంగా కేంద్రానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా అందించిన సవరణలు, సూచనల పూర్తి వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడాలని విద్యార్థులు, యువతకు జేపీ ఈ సందర్భంగా సూచించారు.

# తమిళనాడు విద్యాప్రమాణాలు పెంచటానికి ప్రతిపాదనలు అందించిన ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా






ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో తలసరి ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.34,000 ఖర్చు పెడుతున్న తమిళనాడులో విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన సూచనలను చెన్నైలోని సెక్రటేరియట్‌లో ఆ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి పాండియరాజన్‌ను కలిసి జయప్రకాష్ నారాయణ్ అందజేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు తారా కృష్ణస్వామి, అలవిల్లి శ్రీనివాస్ తదితరులు కూడా పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) లోని లోపం వల్ల పాఠశాల విద్యలో సంస్కరణలు అసాధ్యమవుతున్నాయని, వాటిని సవరించేదాకా వేచిచూడకుండా రాష్ట్రాలు తమ విద్యావ్యవస్థను సంస్కరించే చట్టాలను తెచ్చుకుని రాష్ట్రపతి ఆమోదం పొందాలని జేపీ అన్నారు. ఒక్కో విద్యార్థి మీద తమిళనాడు కంటే ఎక్కువగా తెలంగాణా (రూ.39,000), ఆంధ్రప్రదేశ్ (42,000) ఖర్చు చేస్తున్నా ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని పలు తాజా సర్వేలు కూడా తెలియచేస్తున్నాయని, ప్రభుత్వాలు, పౌరసమాజం మేలుకోవాలన్నారు. తమిళనాడు పర్యటనలో భాగంగా సుప్రీంకోర్టు కొలీజియంపై అడయార్‌లోని గాంధీనగర్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జేపీ పాల్గొన్నారు. ఇందులో ఎన్.రవి (ది హిందూ), జస్టిస్ చంద్రు, మాజీ ఏజీ రాజగోపాల్, సంతానం (ఐఏఎస్), శ్రీరాం.పి, ఎన్ఎల్ రాజా తదితరులు న్యాయవ్యవస్థ జవాబుదారీతనానికి సంస్కరణలు అవసరమని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో, మెరుగైన వైద్యసేవలు లక్ష్యంగా తమిళనాడు మదురైలో జరిగిన 'ప్రాక్టీసింగ్ రెస్పాన్సిబుల్ మెడిసిన్' మేధోమథన కార్యక్రమంలో కూడా జేపీ పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబర్ 16-31, 2016

సంపుటి - 7 సంచిక - 20


## లోపలి పేజీల్లో...


భారత ప్రజాస్వామ్యంలో పౌరసంస్థల ..........5

విద్యావ్యవస్థ పునర్నిర్మాణం కోసం రాష్ట్రాలకు... 8

భయమే పెట్టుబడి... సైనికవ్యయం పైపైకి........ 9

వార్నింగ్ హైదరాబాద్............................. 10

మన పట్నాలు పైన పటారాలే......................16

మట్టికాళ్ల మహానగరాలు.......................... 18

నగరీకరణ సవాళ్లను ఎదుర్కోవడమెలా?....... 20

ఎన్నికల సంస్కరణలకు సమయం ఆసన్నం...... 24

పటిష్ట చట్టంతోనే ప్రజలకు సమాచార హక్కు.. 26

ఆకాంక్షలు చాలవు, ప్రతి ఒక్కరూ పరిష్కారం... 30

అన్నీ ఉన్నా ఆరోగ్యం అందించని రాజకీయమే.. 31

లోక్‌సత్తాకు స్ఫూర్తినిచ్చిన గురజాడ భావాలు... 33

కొండగుంటూరు యువత కృషి ఆదర్శప్రాయం.. 34



## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి




# జిల్లాలు - ఉద్యోగాలు

ఈ దేశం దశ-దిశను మార్చగలిగే అంశాల్లో ముందుండేవి జిల్లాలు, ఉద్యోగాలు! అధికారాన్ని జిల్లా యూనిట్‌గా వికేంద్రీకరించి స్థానికంగా మునిసిపాలిటీలు, పంచాయతీలకు అధికారాలను, నిధులను కేటాయించటం. రాష్ట్రప్రభుత్వాలకు కేంద్రం నుంచి వస్తున్న నిధుల్లో 33శాతాన్ని నేరుగా స్థానిక ప్రభుత్వాలకు కేటాయించటం పాలన తీరుతెన్నుల్నే మార్చేస్తుంది. ప్రస్తుతం రాష్ట్రాలకు వాటాగా కేంద్రం ఇస్తున్న నిధుల్లో మూడోవంతుని.. అంటే సుమారు రూ.13లక్షల కోట్లను స్థానిక ప్రభుత్వాలకు నేరుగా ఇవ్వాలని లోక్‌సత్తా గట్టిగా వాదించింది. అయితే, అంతగా నిధులని కేటాయించకపోయినా 14వ ఆర్థిక సంఘం గణనీయంగా స్థానిక నిధుల్ని పెంచింది. ఈవేళ రికార్డుస్థాయిలో రూ.2,87,000 కోట్లు స్థానిక ప్రభుత్వాలకు కేటాయించారు. ప్రజల చుట్టూ పాలన కోసం ఫెడరలిజాన్ని మూడో అంచెకు తీసుకెళ్లటానికి చేస్తున్న ప్రయత్నమే ఇదంతా. కానీ లోక్‌నాయక్ జేపీ జన్మదినోత్సవం రోజున తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన కొత్త జిల్లాల ఏర్పాటు వెనుక ఈ ఆలోచన ఉన్నట్టు కనిపించటం లేదు. చిన్న జిల్లాలతో ప్రజలకు పాలన మరింత దగ్గరగా వెళ్తుందన్నది వాస్తవమే. జిల్లాల ఏర్పాటు హేతుబద్ధంగా కాకుండా పాలకుల సొంత కారణాలకనుగుణంగా జరిగిందన్న ఆరోపణలున్నా, ఈ ప్రయత్నాన్ని స్వాగతించాల్సిందే. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెబుతున్నట్టు.. దాంతో పాలనలో అద్భుతాలు జరగవు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన మండలాల వల్ల పాలన ప్రజలకు చేరువైందిగానీ విప్లవాత్మకంగా ఏమీ మారలేదు. ఎందుకంటే, పాలనావ్యవస్థ పాతదే! ఇప్పుడు జిల్లాల ఏర్పాటులో కూడా పాత పాలనావ్యవస్థ కొనసాగుతుండటం వల్ల పెద్దగా ఏమీ మార్పులు వస్తాయని ఆశించలేం. మీడియాలో వచ్చిన కేసీఆర్ ఆలోచనల ప్రకారం.. సీఎం-డీఎంల చేతుల్లోనే పాలన కొనసాగుతుంది. అంటే ముఖ్యమంత్రి, కలెక్టర్ మొత్తం పాలనను కేంద్రీకృతం చేసుకుని జిల్లా ప్రజలకు దిక్కుగా ఉంటారు. జిల్లాలో ఏం జరగాలన్నా వారిదే అంతిమ నిర్ణయంగా ఉంటుంది. తన ఇష్టానుసారం వ్యవహరించే కలెక్టర్లనే ముఖ్యమంత్రి ఎంపిక చేసుకునే అవకాశాలు ఎక్కువ కాబట్టి, 31 జిల్లాల కలెక్టర్ల పేర్లూ ప్రజలకు గుర్తులేకపోయినా ముఖ్యమంత్రి గుర్తుంచుకుని అధికారమంతా తన చేతుల్లోనే కేంద్రీకృతం చేసుకుంటారన్నమాట. ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల చేతిలో బందీ అయి ఫిరాయింపులను ప్రోత్సహించకుండా ప్రత్యక్షంగా ఎన్నికయ్యే సంస్కరణ కావాలిగానీ, అన్ని అధికారాలు ముఖ్యమంత్రి చేతిలోనే ఉండాలనటం చాలా ప్రమాదకరం. ముమ్ముందు ఈ కేంద్రీకృతం చాలా అవాంఛనీయ పరిణామాలకు దారితీస్తుంది. జిల్లాల సంఖ్యను పెంచుతూ కేసీఆర్ 'సీఎం-డీఎం పర్యవేక్షణ' అనే పదాన్నే వాడుతున్నారు తప్ప 'ప్రజల భాగస్వామ్యం' అనే పదాన్ని ఎక్కడా వాడటంలేదు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఒక వార్డులోనే అన్ని కార్యాలయాలూ ఉన్నా, వాట్సాప్‌లు ఇతర సాంకేతిక సాధనాలు ఉన్నా పాలన సక్రమంగా జరగదు. కాబట్టి ప్రజల భాగస్వామ్యముండేలా జిల్లాల ఏర్పాటు జరిగితేనే తెలంగాణ ప్రజలు ఆశిస్తున్న స్వయంపాలన సాధ్యమవుతుంది. జిల్లా యూనిట్‌గా ప్రణాళికలను రూపొందించటం, జిల్లా కౌన్సిళ్లను పునరుద్ధరించటంతోపాటు స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు, వార్డు స్థాయిలో ప్రజలకు తలసరి రూ.1000-2000 కేటాయించటం ప్రజల్ని పాలనలో భాగస్వాముల్ని చేయటంలో కీలకం. అక్కడ అవినీతి జరిగితే చర్యలు తీసుకోవటానికి జిల్లా స్థాయిలోనే అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటుచేయాలి. వీటితోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా సరైన టైంలో ప్రజలకు పనులు జరిగేందుకు, ఆలస్యమైతే పరిహారం చెల్లించేందుకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని అమలు చేయాలి. జిల్లా అభివృద్ధిలో భాగంగా చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి పరిశ్రమలను ప్రోత్సహించాలి. లోక్‌సత్తా ఎన్నికల ప్రణాళికలో భాగంగా 2009లోనే ప్రతి జిల్లాకూ 50 చిన్న పట్టణాలు, 3లక్షల ఉద్యోగాలను హామీ ఇచ్చింది. ఎలా ఆ చిన్న పట్టణాలను, ఉద్యోగాలను సృష్టిస్తామో కూడా తెలియచేస్తూ రైలు ప్రచారయాత్రలో కొన్ని జిల్లాల్లో ఎన్నికల ప్రణాళికను విడుదల చేశాను. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా సర్వేలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉపాధి పరిస్థితి దేశంలోనే అత్యంత ఆందోళనకరంగా ఉంది. దాదాపు సగం మంది గుంతలు పూడ్చటం, చెరువులు పూడిక తీయటం వంటి పనులతోనే ఉపాధి పొందుతున్నారు. గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లలో 80-90శాతం సరైన ఉద్యోగాల్ని పొందలేకపోతున్నారు. నైపుణ్యాలివ్వని విద్యావ్యవస్థ, ఉపాధి అవకాశాలు లేకపోవటం సవాళ్లు విసురుతున్నాయి. వ్యవసాయాన్ని వ్యాపారంలా చేయకపోతే, ఆర్థిక కేంద్రాలుగా చిన్న పట్టణాలను పెంచి పెద్దఎత్తున ఉద్యోగాలను సృష్టించకపోతే 2020నాటికల్లా రాష్ట్ర బడ్జెట్ రూ.5లక్షల కోట్లయినా చివరికి ప్రజలు ఓడిపోవాల్సి ఉంటుంది.. తెలంగాణలాగే కేంద్రీకృత పాలనకు తోడు.. వృద్ధి అంకెలు రంకెలేస్తున్నా ఏపీలో ఉద్యోగాలు తెలంగాణ కంటే తక్కువగా వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పన్ను రాయితీలు ఇవ్వలేనప్పుడు, ఇతర రాష్ట్రాలు అభ్యంతరపెడుతున్నప్పుడు ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణ సహా వెనకబడిన 100 జిల్లాలకు, మెట్టప్రాంతాలకు ఇవ్వాలని లోక్‌సత్తా ప్రతిపాదించింది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు, కేంద్రం కూడా నోరుమెదపటంలేదు. కేంద్రీకృత పాలన, ఉద్యోగాల్లేని ఆర్థికాభివృద్ధిలో తెలుగు రాష్ట్రాల పాలకులతో పోటీపడుతున్న నరేంద్రమోదీ.. పీఎం-సీఎం-డీఎం ఫార్ములాను మార్చి జిల్లా యూనిట్‌గా వికేంద్రీకరణ, సర్వీస్ గ్యారంటీ చట్టం, సరైన విద్య, ఆరోగ్యం, చిన్న ఆర్థిక పట్టణాల అభివృద్ధితో ఉద్యోగాల సృష్టికి మోదీ ప్రభుత్వం కూడా చొరవ తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్కరణలు చేయకపోతే రోబోల మధ్య యువతకు నిరుద్యోగ భృతి, మద్యం బాటిళ్లు, స్మార్ట్ ఫోన్ ఉచితంగా ఇచ్చే స్కీమే దేశానికి మిగులుతుంది. -

మీ

# కార్టూన్ కార్నర్




**ఇది అన్యాయం... లంచం తీసుకుని**
**కట్టడానికి అనుమతి ఇచ్చింది మీరే... ఇప్పుడు కూలుస్తోంది మీరే !**

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ‘భారత ప్రజాస్వామ్యంలో పౌరసంస్థల ఉద్యమాలు - పోరాటపంథాలు’పై జేపీ నవ పరిష్కారాలకు ఐఐపీఏ పురస్కారం




‘భారత ప్రజాస్వామ్యంలో పౌరసంస్థల ఉద్యమాలు – పోరాట పంథాలు’ గురించి చర్చిస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అందించిన నవ పరిష్కారాలకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) ప్రతిష్ఠాత్మక టి.ఎన్ చతుర్వేది పురస్కారం లభించింది. ఈ అంశాలతో ఇండియన్ జర్నల్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో గత ఏడాది ప్రచురితమైన జేపీ వ్యాసాన్ని అవార్డుకు కమిటీ ఎంపిక చేసింది. అక్టోబర్ 21, 2016న న్యూఢిల్లీ ఐఐపీఏలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోవలసిందిగా సంస్థ డైరెక్టర్ డా॥ తిష్యరక్షిత్ ఛటర్జీ జేపీకి లేఖ పంపారు. వివరాలను లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.

ప్రజల సమస్యలపై ప్రభుత్వాలు సకాలంలో స్పందించలేకపోవటం, ఎన్ని రకాలుగా ఆందోళనలు చేసినా ప్రభుత్వాలు స్పందించటంలేదంటూ జనజీవితాలకు ఆటంకం కలిగించే పోరాటపద్ధతులు పెరగటం నేపథ్యంలో.. విధానాల్లో మార్పు కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తేవటానికి స్వచ్ఛంద సంస్థలు అనుసరించాల్సిన పద్ధతులపై జేపీ రాసిన వ్యాసాన్ని, అందులో చూపిన పరిష్కారాల్ని అత్యంత ప్రాధాన్యమైనవిగా, రాజకీయ పార్టీలకు కూడా అవసరమైనవిగా అవార్డు ఎంపిక కమిటీ భావించింది.

కొందరు వ్యక్తులు, కార్పొరేట్‌లకు ప్రభుత్వం నుంచి ఆర్థిక లాభాలను సాధించటానికి పని చేసే సంస్థలు, ఎటువంటి

లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేయాలనుకునే సంస్థలు.. రెండూ ఒత్తిడి బృందాలే అయినా వేర్వేరుగా చూడాలని వ్యాసంలో జేపీ స్పష్టంచేశారు. విస్తృత ప్రజా ప్రయోజనాల రీత్యా ప్రభుత్వ విధానాల్లో మార్పు కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థల ఉద్యమాలు, పోరాట పంథాలపై ఎక్కువగా చర్చించి పరిష్కారాలను ప్రతిపాదించారు.

స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడచినా మనదేశంలో ప్రభుత్వాల పాత్ర, పౌర ఉద్యమాలు– ఆందోళనాపద్ధతులపై ఉన్న గందరగోళాన్ని తొలుత జేపీ ప్రస్తావిస్తూ.. ప్రజలు ఎన్నికల్లో తమ ప్రతినిధులను ప్రభుత్వంగా ఎన్నుకున్నా ఎన్నికల మధ్య తమ ఇష్టాలు, అభిప్రాయాలకనుగుణంగా పనిచేసుకునే, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్వేచ్ఛ, ఇందుకోసం సంస్థలు, సంఘాలుగా ఏర్పడే హక్కు ఉందని అన్నారు. అయితే ఎన్నికైన ప్రభుత్వాన్ని చట్టబద్ధ బాధ్యతను హరించే విధంగా, ప్రజాస్వామ్యం పనిచేయలేనిరీతిలో ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చే హక్కు ఈ సంస్థలకు ఉండదన్నారు. ప్రభుత్వం ఎన్నికైన మరుసటిరోజు నుంచి మనకు నచ్చినట్టు చేయటం లేదంటూ రాజ్యాంగేతర పద్ధతులను సైతం ఆశ్రయించి ఆందోళనలు చేయటం చివరికి ప్రజాప్రయోజనాలనే దెబ్బతీస్తుందన్నారు. ఎంతో శక్తిమంతమైన వ్యవస్థీకృతమైన విదేశీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటం కోసం గాంధీజీ సహాయ నిరాకరణ, బహిష్కరణ, సత్యాగ్రహ, హర్తాళ్, బంద్, నిరవధిక నిరాహారదీక్ష వంటి ఆందోళన పద్ధతుల్ని రూపొందించారని, ఆయన అసమాన వ్యక్తిత్వం వల్ల అవన్నీ గొప్ప ఆయుధాలుగా రూపొందాయని, అయితే స్వతంత్ర భారతంలో కూడా అవే ఆందోళనాపద్ధతుల్ని అనుసరించటం స్వపరిపాలన అవదని జేపీ అన్నారు. జాతి అంతరాత్మ మీద గాంధీ ప్రభావం, స్వాతంత్ర్యోద్యమ అపురూప జ్ఞాపకాలు గాఢంగా ఉండటం వల్ల.. ఎన్నికవ్వని, విదేశీ, అప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి – మనలో నుంచే మనం ఎన్నుకున్న ప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి పద్ధతుల మధ్య తేడాని మన ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా గుర్తించలేకపోతున్నాయన్నారు. ఆందోళనల పేరుతో ఆటంకాలు, అడ్డూఅదుపూలేని చట్టధిక్కారాలు వల్ల తలెత్తే ప్రమాదాల గురించి అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో హెచ్చరించారన్నారు. భిన్న స్వరాలు, భిన్న ఆకాంక్షలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ సుసంపన్నతకు అద్దం పడుతున్నప్పటికీ, వాటిని సాధించుకోవటానికి తగిన పద్ధతుల్ని మనమే గౌరవించకపోతే ఎప్పటికీ ఫలితాలు రావన్నారు. ఏ కాలంలో, ఏ సమాజంలోనైనా ప్రజాస్వామ్యాన్ని ఆచరణలో చూపటం సంక్లిష్ట ప్రక్రియని, ఎంతో పేదరికం, నిరక్షరాస్యత ఉన్న మనదేశంలో అది మరీ కష్టమని అన్నారు. సృజనాత్మక పరిష్కారాలతో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే వ్యవస్థల్ని నిర్మించటానికి బదులు మన పాలకులు ప్రభుత్వోద్యోగులకు సేవలతో సంబంధంలేని భారీ జీతాలు, ప్రజలకు తాత్కాలిక తాయిలాలు, నచ్చిన కార్పొరేట్లు, బంధుగణానికి ప్రత్యేక రాయితీలు, ప్రకృతి వనరుల్ని దోచిపెట్టటం ఎన్నికల్లో గెలవటానికి ఫార్ములాగా అనుసరిస్తున్నారన్నారు. ఈ పాలసీలు, ప్రపంచీకరణ ఒడిదుడుకులు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంటే భావోద్రేకాలతో ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనివల్ల పేదరికం శాశ్వతంగా కొనసాగుతోందన్నారు. ప్రజలు తమ జీవితంలో ఎదగటానికి కీలకమైన విద్య, ఆరోగ్యంలో భారత్ ప్రపంచంలోనే అధమస్థానాల్లో ఉండటమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇలాంటి తాత్కాలిక పథకాల కోసం ప్రభుత్వంతో పోటీపడుతున్న స్వచ్ఛంద సంస్థలకు మనదేశ నేపథ్యంలో మంచి ఆదరణే లభిస్తుందని, ప్రభుత్వాల్ని శత్రువులుగా చూపుతూ రాజకీయాల్ని నీచమైనవిగా పేర్కొన్నాక, ఇక బడ్జెట్లు, అన్ని వర్గాల ప్రయోజనాలను సమన్వయం చేయటం, పేదరికాన్ని తొలగించి ప్రజలకు దీర్ఘకాలంలో ఆదాయాన్ని పెంచటం వంటి బాధ్యతలేవీ లేకుండా నచ్చినట్టు ఈ సంస్థలు వ్యవహరిస్తుంటాయన్నారు. జవాబుదారీతనం లేకుండా ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు చూపే మితిమీరిన ప్రభావం ప్రజాస్వామ్యానికి, పాలనకు ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. దీనికితోడు ప్రజలలో అత్యుత్తములను రాజకీయాలలోకి ఆహ్వానించే శక్తిని కోల్పోయి వంశపారంపర్య, కుటుంబ ఆస్తులుగా మారిన రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చినా ప్రజాప్రయోజనాలపై ఆందోళనలకు సకాలంలో సరైనరీతిలో స్పందించటం లేదన్నారు. ఓట్ల కొనుగోలు, తాత్కాలిక పథకాల కోసం కోసం చేసే విపరీత ఖర్చుతో ఎన్నికల వ్యవస్థను డబ్బుమయం చేసి సమర్థులు, నిజాయతీపరులు గెలవలేని పరిస్థితిని కల్పించాయన్నారు. ఎలాగోలా ప్రభుత్వంలోకెళ్లటం, ప్రతిపక్షంలో ఉంటే ప్రభుత్వం చేసే పనులన్నిటి మీదా దుమ్మెత్తిపోయటమే రాజకీయంగా మారిందన్నారు.

**స్పందన కొరవడిన పాలకులు, రాజ్యాంగేతర పద్ధతులనైనా అనుసరించాలన్న భావన పెంచుకుంటున్న పౌర సంస్థలు కూడా సంస్కరించుకోవాలంటూ ఈ నవ సూచనల్ని జేపీ చేశారు..**

1) పౌర సంస్థ వ్యక్తుల, కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాల లాబీయింగ్ కోసం పనిచేస్తుంటే దేశ ప్రయోజనాల దృష్ట్యా రిజిస్ట్రేషన్, పర్యవేక్షణ, పారదర్శకత విషయంలో నిబంధనల్ని కచ్చితంగా పాటించటం, నియంత్రించటం అవసరం.

2) వివాదాస్పద అంశాలు, ప్రజల మధ్య చీలిక తెచ్చే అంశాల మీద పనిచేసే పౌర సంస్థలు ఎన్నికైన ప్రభుత్వానికి విధానాల్ని నిర్దేశించటంలో తమ పరిమితిని గుర్తించాలి. విధానాలపై రాజకీయ విభేదాలుంటాయి. సాధ్యమైనంతవరకు అవి ప్రజాక్షేత్రంలో ప్రజల తీర్పుతోనే తేలాలి. ప్రజల తక్షణ అవసరాలను, దీర్ఘకాలిక ప్రయోజనాలను సమన్వయం చేయాల్సిన బాధ్యత ఎన్నికైన ప్రభుత్వాలకుంటుంది. కొద్దిమంది తరపున వివాదాస్పద అంశాల కోసం నియంత్రణలేని ఒత్తిడి చేసే సంస్థల వల్ల ప్రజాప్రయోజనాలు దెబ్బతింటాయి, పరిపాలన అసాధ్యమవుతుంది.

3) ప్రభుత్వ మౌలిక బాధ్యతల విషయంలో రాజకీయ పార్టీలు, మీడియా, పౌరసమాజం మధ్య స్థూల ఏకాభిప్రాయం ఉండాలి. జాతీయ భద్రత, శాంతిభద్రతలు, న్యాయం, చట్టబద్ధ పాలన, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్తు, నీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సహా మౌలిక వసతులు అందించటం ఆధునిక నాగరిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు చేయాల్సిన కనీస పనులని అందరూ గుర్తించాలి.

4) ఎన్నికైన ప్రజాస్వామిక ప్రభుత్వానికి, దేశ వ్యవస్థలకు తాము ప్రత్యామ్నాయం కాదని పౌర సంస్థలు గుర్తించాలి. రాజకీయ ప్రక్రియ పట్ల గౌరవం, నిరంతరం, నిర్మాణాత్మకంగా హేతుబద్ధ వాదనలు, సాక్ష్యాలతో మార్పు కోసం పనిచేయటం ఈ ఒత్తిడి బృందాల లక్షణాలుగా ఉండాలి.

5) రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో కొన్ని ఆమోదయోగ్య విధానాలతో పార్టీలు, పౌరులు, పౌరసంస్థల కార్యాచరణ ఉండాలి. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంస్థలుగా ఏర్పడే హక్కు, ఓటు.. ఇవి ఉన్నాక జనజీవితాల్ని ఆటంకపరిచే ఆందోళనాపద్ధతులకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదు. ఈ రాజ్యాంగ పద్ధతుల ద్వారానే పెట్రోలు బంకుల్లో అక్రమాల్ని అరికట్టటం, ఓటరు రిజిస్ట్రేషన్‌లో అవకతవకల్ని సరిచేయటం, నేరచరిత్రుల వివరాలు బైటపెట్టటం, ఆర్‌టీఐ, సహకార సంఘాల స్వయంప్రతిపత్తి, స్థానిక న్యాయస్థానాలు, ఎన్‌జేఏసీ వంటి దాదాపు 16 కీలక చట్టాల్ని, రాజ్యాంగ సవరణల్ని అందరినీ సమన్వయం చేసుకుంటూ లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ సాధించాయి.

6) ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థా సర్వాధికారి కాదు. ఎవరైనా జవాబుదారీయే. ప్రజలు స్వేచ్ఛగా వేసిన ఓటుతో తాము ఎన్నికయ్యామన్న స్పృహ పాలకులకు ఎప్పుడూ ఉండాలి.

7) చట్టసభలు ప్రజాస్వామిక చర్చ, పరిష్కారాలకు సరైన వేదికలని పార్టీలు, ప్రతిపక్ష నేతలు, సభ్యులు గుర్తించాలి. చర్చను, స్వేచ్ఛగా అభిప్రాయ వ్యక్తీకరణను భగ్నం చేయటానికి పార్టీలు విప్ జారీచేయటం నాగరిక ప్రజాస్వామ్యం అనిపించుకోదు. చట్టసభల వైఫల్యం ప్రజాస్వామ్యాన్ని పతనం చేస్తుంది.

8) రాజకీయ వ్యవస్థల్లో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు పార్టీల్ని, ఎన్నికల ప్రక్రియను సంస్కరించాలి. సమర్థత, సేవాభావం, నిజాయతీ కలిగిన సామాన్యులు సైతం వేగంగా నైతిక పద్ధతుల్లో, ప్రత్యామ్నాయ విధానాలు చూపుతూ ఎదగగలిగేలా, ఎన్నికల్లో గెలవగలిగేలా సంస్కరణలు ఉండాలి. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలి.

9) మీడియా బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచాలి. విద్వేషం, ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా, ఒకరికి లాభం ఇంకొకరికి నష్టమనేలా చర్చ చేయటం హేతుబద్ధ నిర్ణయాలను, తద్వారా ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తుందని గుర్తించి వ్యవహరించాలి. ◆

# ఆందోళనా పద్ధతులపై చర్చకు అవార్డు దోహదం చేయాలి

**రా**జ్యాంగ హక్కులను గౌరవిస్తూ మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఆందోళనా కార్యక్రమాలు ఉండాలని, ఈ దిశగా రాజకీయ పార్టీలు, పౌరసమాజంలో చర్చకు ఐఐపీఏ అవార్డు దోహదం చేయాలని తనను కలిసిన లోక్‌సత్తా పార్టీ నేతలతో జేపీ అన్నారు. పురస్కారంపై లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము, ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, కిశోర్ మల్లాది, ఎల్బీనగర్ అధ్యక్షుడు వంశీప్రసాద్, సకినాల సత్తయ్య, యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు శివరామకృష్ణ తదితర నేతలు జేపీని అభినందించారు.

# విద్యావ్యవస్థ పునర్నిర్మాణం కోసం రాష్ట్రాలకు స్వేచ్ఛనిచ్చిన శ్రీలంక




ఓటు ప్రధానంగా రాష్ట్రాలలో ప్రభుత్వాలను బట్టి వేస్తున్నందున.. విద్య, ఆరోగ్యం వంటి ప్రధాన రంగాలలో ప్రజల అంచనాలకు తగ్గ సంస్కరణలు తెచ్చుకునేందుకు జమ్మూకాశ్మీర్ సహా దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు జాతీయ సమగ్రత పరిధిలో మరింత స్వయంప్రతిపత్తిని కల్పించే విధానం అమలుచేయాలని లోక్‌సత్తా కోరుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే లోపభూయిష్టమైన కేంద్ర విద్యా హక్కు చట్టంలో మార్పుల కోసం వేచి చూడకుండా రాష్ట్రాలు తమ విద్యారంగాన్ని మెరుగుపరుచుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తరచూ సూచిస్తున్నారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు కేంద్రానికి ప్రతిపాదనలు అందచేయటంతో పాటు కేంద్రంతో సంబంధం లేకుండా తమిళనాడులో చేపట్టాల్సిన చర్యలపై కూడా ఇప్పటికే ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా తరపున కొన్ని సూచనల్ని ఆ రాష్ట్ర మంత్రికి జేపీ అందచేశారు. విద్యావ్యవస్థలో మెరుగైన మార్పులు తెచ్చుకునేందుకు వీలుగా పొరుగున్న ఉన్న శ్రీలంక కూడా రాష్ట్రాలకు స్వేచ్ఛను ఇచ్చింది. మనదేశంలో కేంద్రం ఈ విషయంలో రాష్ట్రాలను ప్రోత్సహించటం లేదు, సరైన మార్గదర్శకాలను ఇవ్వటం లేదు. అందరికీ విద్య, ఆరోగ్యం పెద్ద అంశాలు కాదన్నట్టే దాటవేస్తోంది. మలేరియాని పూర్తిగా నిర్మూలించిన శ్రీలంక.. ప్రభుత్వ మౌలిక బాధ్యతలైన విద్య, ఆరోగ్య రంగాల నిర్వహణలో భారత్ కంటే మెరుగ్గా వ్యవహరిస్తోంది. తాజాగా ఓ ప్రముఖ తెలుగు దినపత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో శ్రీలంక ప్రధాని ప్రధాని రణిల్ విక్రమ సింఘే ఈ రంగాలలో తమ దేశం కృషిని వివరించారు. విద్య, ప్రజారోగ్యాల మీద శ్రీలంక ప్రభుత్వం ఎంతో వెచ్చించిందని, ఇప్పుడు కనిపిస్తున్న పురోగతి వెనక ఎంతో కృషి ఉందని శ్రీలంక ప్రధాని తెలిపారు. ప్రభుత్వమేకాకుండా ప్రైవేటు రంగం, వ్యక్తులు, ధార్మిక సంస్థలు కూడా ఈ రెండు కీలక రంగాల్లో ఎంతో ఖర్చు చేశాయన్నారు. ఈ కృషిని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహాన్ని సిద్ధంచేశామన్నారు. దేశంలోని ప్రతి విద్యార్థికీ 13ఏళ్ల నిర్బంధ విద్యను అమలుచేయాలని నిర్ణయించామన్నారు. 2020కల్లా దీన్ని అమల్లోకి తేవాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రస్తుతం పదో తరగతి (ఒ లెవెల్) స్థాయితోనే ఎంతోమంది చదువులు మానేస్తున్నారని, వదిలేస్తే వీళ్లు పైచదువులకు వెళ్లరని, అందుకని వీళ్ల కోసం వృత్తినైపుణ్య కోర్సులను ప్రోత్సహించాలనుకుంటున్నామని తెలిపారు. చదువులకు, ఉద్యోగాలకు మధ్య వ్యత్యాసాన్ని అదుపులో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు, ప్రైవేటు రంగం.. వీటన్నింటి మధ్యా సమన్వయం సాధించాలని ప్రయత్నిస్తు న్నామన్నారు. అలాగే ఎలాంటి నూతన నైపుణ్యాలు అవసరమన్నదానిపై కూడా దృష్టి పెట్టామన్నారు. విద్యావ్యవస్థ పునర్నిర్మాణం కోసం రాష్ట్రాలకు స్వేచ్ఛనిచ్చామన్నారు. ఇప్పుడు శ్రీలంకకు చాలామంచి విశ్వ విద్యాలయాలు వస్తున్నాయని, వీటిలో చదువుకునే విద్యార్థులకు విద్యారుణాల్ని అందించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ◆

## రాజకీయ అవినీతే నయీం నేరసామ్రాజ్యానికి కారణం

రాజకీయాలలో అండతోనే నయీం నేర సామ్రాజ్యం విస్తరించిందని, నేరమయ రాజకీయాల పర్యవసానం నయీం ఎన్‌కౌంటర్‌తో ఆగిపోదని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు అన్నారు. రాజకీయాలలో డబ్బు, మద్యం, కండబలాల్ని అరికడితేనే ఛోటా నయీంలను అంతం చేయగలమని అన్నారు. భువనగిరిలో నిర్వహించిన లోక్‌సత్తా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నయీం నేర సామ్రాజ్యం ఆక్టోపస్‌లా జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటి విస్తరిస్తున్నా ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, పోలీసు, న్యాయవ్యవస్థలు, మీడియాకు తెలియదంటే అమాయకత్వమేనన్నారు. నయీం అనుచరులపై పకడ్బందీ కేసులు పెట్టాలన్నారు. ఇటీవల మెదక్ జిల్లా కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామకృష్ణారెడ్డి ఆత్మహత్య పోలీసుశాఖలో అవినీతి విశృంఖలత్వానికి అద్దం పడుతోందన్నారు. ఎన్నికల సంస్కరణలు, ప్రజల్లో చైతన్యంతో నేరరాజకీయాల్ని, సర్వీస్ గ్యారంటీ చట్టంతో ప్రభుత్వోద్యోగుల అవినీతిని అరికట్టేందుకు లోక్‌సత్తా పోరాడుతోందన్నారు. ◆

# భయమే పెట్టుబడి.. సైనికవ్యయం పైపైకి

మన శత్రుదేశాల వెన్నులో దడ పుట్టించే అధునాతన రాఫెల్ విమానాలు **16** ఏళ్ల తర్వాత ఎట్టకేలకు భారత వైమానిక దళంలో భాగమయ్యాయి. వీటి కొనుగోలు విలువ సుమారు రూ.**59**వేల కోట్లు. రాఫెల్ ఒప్పందంలో భాగంగా గగనతలం నుంచి గగనతలంలోకి దృగ్గోచర ఆవలి లక్ష్యాల (బీవీఆర్)ను ఛేదించే 'మెటియోర్' క్షిపణులు, భూతలంపై దాడి చేయగల 'స్కాల్ప్' క్రూయిజ్ క్షిపణులు కూడా భారత్‌కు అందుతాయి. మొత్తం ఒప్పందం విలువలో సుమారు **50**శాతం వరకు ఆ విమానాల తయారీ సంస్థ భారత్‌లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. రాఫెల్ యుద్ధవిమానాల వల్ల భారత వైమానిక దళం లక్షిత **44** స్క్వాడ్రన్ల మేర బలపడుతుంది. చైనా, పాకిస్తాన్‌లను కట్టడిచేయటంలో చాలా శక్తిమంతంగా ఇవి ఉపయోగపడగలవని భావిస్తున్నారు.. ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే.. రెండోవైపు, ఆయుధాలు పట్టుకుని చేసే సాంప్రదాయ యుద్ధాలు ఉన్నకొద్దీ పరిమితమవుతున్నాయి. యుద్ధమంటూ వస్తే మనకూ భారీనష్టం తప్పదని అర్థమవటంతోనే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు **56** అంగుళాల ఛాతీ గురించి మాట్లాడిన నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది. ఉరీ దాడి నేపథ్యంలో పాక్‌కు గుణపాఠం చెప్పటానికి పీవోకేలోకి చొరబడి మెరుపు దాడులు (ఇలాంటివి యూపీయే హయాంలో కూడా జరిగాయనటం, ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ ప్రచారం చేసుకోవటం, నిరూపణల సవాళ్లు, పీవోకే భారత్‌దే తప్ప పాక్‌ది కాదని వాదించటం వల్ల సంచలన చర్చనీయాంశమవుతున్నాయి), చిన్నపాటి యుద్ధాలు చేసినా 'యుద్ధాయ కృతనిశ్చయ:' అంటూ పూర్తిస్థాయి సమరానికి భారత ప్రభుత్వం సాహసించకపోవచ్చు. యుద్ధపంథాని వీడి దక్షిణాసియాని ఒకే ఆర్థిక, సాంస్కృతిక యూనిట్‌గా చూసే సువిశాల ప్రణాళిక తప్ప భారత్, పాక్‌లకు మరో శాశ్వత పరిష్కారం లేదు. ఎన్నికలలో గెలవటానికి అవసరమైతే పొరుగుదేశాలతో యుద్ధానికి దిగటానికి కూడా మోదీ సర్కారు వెనుకాడదన్న విశ్లేషణల్ని.. ముమ్ముందు చెప్పలేంగానీ, ప్రస్తుతానికి పరిమితుల మధ్యే చూడాలి. పాక్‌తో పూర్తిస్థాయి యుద్ధమంటే అణ్వాయుధాలున్న ఉగ్రవాదుల బెడదతోపాటు చైనాతోనూ యుద్ధమే. చైనాతో యుద్ధమంటే చివరికి పైకి లేపాల్సింది భారత్‌నే. అయితే, ప్రత్యక్ష యుద్ధాల కన్నా ఆర్థిక ఆంక్షలు, నదీజలాలు వంటి వనరుల నియంత్రణ, అధునాతన అంతరిక్ష, సైబర్ నిఘా, ప్రపంచదేశాల మధ్య ఏకాకిని చేయడం వంటి మార్గాల్లో యుద్ధాలు చేసి శత్రువును నియంత్రించాలని ఎక్కువమంది భావిస్తున్నా.. పరస్పర అపనమ్మకం, ఉగ్రవాదం, ఆయుధ వ్యాపార దేశాల స్వార్థం వల్ల కొత్త ఆయుధాల తయారీ, కొనుగోలు యధావిధిగా కొనసాగుతోంది. ఈరకంగా ప్రపంచ సైనిక వ్యయం **2015**లో **112**లక్షల కోట్లకు చేరింది. ఘర్షణలు, ఉగ్ర దాడుల్ని అరికట్టటం, ఇతర దేశాల నుంచి దాడులు జరగకుండా భయపెట్టి నిరోధించటం వంటి కొన్ని అవసరాలకు, అప్పుడప్పుడూ ఉత్కంఠభరిత విన్యాసాలకు తప్ప.. రాజులు, రాజులు, రాణులు, గవర్నర్లు వంటి ఉత్సవ విగ్రహాల లాగానే ఈ ఆయుధాలు కూడా గదుల్లో మూలుగుతుంటాయి. ప్రపంచం ఇంకా ఎంత అనాగరిక భయాలు, స్వార్థాల మధ్యే నలుగుతోందో రోజురోజుకీ పెరుగుతున్న ఈ ప్రపంచ సైనికవ్యయ లెక్కలే చెబుతున్నాయి..




| | వ్యయం బిలియన్ డాలర్లలో (రూ. కోట్లలో) | ప్రపంచ వ్యయంలో వాటా |
|---|---|---|
| సౌదీ అరేబియా | 87.2 (5,81,319) | 5.2 |
| రష్యా | 66.4 (4,42,656) | 4.0 |
| బ్రిటన్ | 55.5 (3,69,991) | 3.3 |
| భారత్ | 51.3 (3,41,991) | 3.1 |
| ఫ్రాన్స్ | 50.9 (3,39,325) | 3.0 |
| జపాన్ | 40.9 (2,72,660) | 2.4 |
| జర్మనీ | 39.4 (2,62,660) | 2.4 |
| దక్షిణ కొరియా | 36.4 (2,42,661) | 2.2 |
| బ్రెజిల్ | 24.6 (1,63,996) | 1.5 |
| ఇటలీ | 23.8 (1,58,663) | 1.4 |
| ఆస్ట్రేలియా | 23.6 (1,57,329) | 1.4 |
| యూఏఈ | 22.8 (1,51,996) | 1.4 |
| ఇజ్రాయెల్ | 16.1 (1,07,331) | 1.0 |

◆

# వార్నింగ్ హైదరాబాద్!

## స్మార్ట్ సిటీల భ్రమల్లోనే లక్షల కోట్లు ఖననంగా పెడదామా?

## మౌలికవసతులు-వార్డుల్లోకి పాలన-10,000 చిన్న పట్టణాల వాస్తవంలోకొద్దామా?

*ఈ ఏడాది సెప్టెంబర్‌లో అసాధారణ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధ్యయనాలు కొన్ని నెలలుగా చెబుతూనే ఉన్నాయి. అయినా వర్షాలు మొదలవగానే ఏదో అనుకోని ఉత్పాతం జరిగినట్టు హైదరాబాద్ అస్తవ్యస్తమైంది. గత రాజకీయ తప్పిదాలతో రాజీపడటం, పాత కేంద్రీకృత రాజకీయాన్ని యధావిధిగా కొనసాగించటం, కొత్తగా పాలనా సంస్కరణల్ని తీసుకురాకపోవటంతో హైదరాబాద్ భారీ మూల్యాన్ని చెల్లించింది. కాస్త డబ్బున్న కాలనీల్లోని కష్టాలు, కంటికి వెంటనే కనిపించే వాహనదారుల వెతలు పతాకశీర్షికలయ్యాయిగానీ.. రెక్కాడితేగానీ డొక్కాడని వారి రోజువారీ ఆదాయం, జీవితాలు కూడా ఈ ముంపు తాకిడికి భారీగా దెబ్బతిన్నాయి. సరైన రోడ్లు, రవాణా వ్యవస్థను ఏర్పరచకుండా బస్సుల్లో వై-ఫై గురించి మాట్లాడుతూ స్మార్ట్ భ్రమల్లో విహరింపచేస్తూ వాతావరణ శాఖ హెచ్చరికలకు తక్షణ సన్నద్ధత కూడా చూపలేని పాలకుల వైఫల్యమే ఈ దుస్థితికి కారణం. మన మెదళ్లలో బూజుపట్టిన సాఫ్ట్‌వేర్ ఉంటే ఎంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానమున్నా సక్రమంగా వినియోగించలేం. స్మార్ట్ వాస్తవంలోకొచ్చి నగర పాలనా సంస్కరణలను అమలుచేయాలని హెచ్చరిస్తోంది హైదరాబాద్. ఆంధ్రప్రదేశ్‌లోనూ, దేశంలోని అనేక ప్రాంతాలలోని పట్టణ ప్రాంతాలలోనూ వర్షాలు పడినా కోటి జనాభా ఉన్న హైదరాబాద్‌ను నగర పాలన సంస్కరణలకు ఒక కేస్ స్టడీగా తీసుకుందాం.*

హైదరాబాద్ వంటి ఒక మహానగరంలో సాధారణం కంటే ఐదురెట్లు ఎక్కువ వర్షం కురిస్తే కొన్ని ప్రాంతాలు జలమయమై అక్కడక్కడా సమస్యలు రావొచ్చు, పారిశుద్ధ్య, ఆరోగ్య విభాగాలు మరికొంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి రావచ్చు. కానీ ఏకంగా రోడ్ల మీదకే రావద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేయాల్సి రావటం మన పాలనావ్యవస్థ దివాళాకోరుతనానికి అద్దం పడుతుంది. హైదరాబాద్‌ను తీర్చిదిద్దింది తానేనంటూ తరచూ చెప్పుకునే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మౌనం వహించాల్సిన పరిస్థితి. ఆయన అదృష్టవశాత్తూ ఇప్పుడున్న పాలకులు కూడా కేంద్రీకృత పాలనకే పట్టం గడుతూ స్థానిక పాలనను నిర్లక్ష్యం చేసేవారు కావడంతో, చెన్నై, ముంబయి, ఢిల్లీ వంటి నగరాలు కూడా ఇదే రికార్డుతో ఉండటంతో మరీ ఎక్కువమంది ఆయన మీద గురి పెట్టలేకపోయారు. హైదరాబాద్‌లో ప్రజలు తాజాగా ఎదుర్కొన్న వాన ముంపు సమస్య గత కొన్ని దశాబ్దాలుగా మన పాలకులు అనుసరిస్తున్న అవినీతి, అధికార లాలస, వైఫల్య విధానాలకు, అధ్వాన్న పాలనా వ్యవస్థకు నిదర్శనం. ఈ మాటను కొంతమేర కొంత అతిశయోక్తితోనైనా అంగీకరించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుని అభినందించాలి. హైదరాబాద్‌లో వర్షాల వరదలకు కారణమైన అక్రమ నిర్మాణాలకు అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకుంటే మునిసిపల్ కార్పొరేషన్‌లో ఒక్కరూ మిగలరు అన్నారాయన. రాష్ట్రానికి (దేశానికి) వెన్నెముకలాంటి మన బ్యూరోక్రసీ ఒక వ్యవస్థగా కుప్పకూలిందని ఆయన అంగీకరించారు. కొందరు




గొప్ప ప్రభుత్వోద్యోగులున్నా, మన బ్యూరోక్రసీ వ్యవస్థ పనికిమాలినదని, సర్కారీ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించేందుకు నిర్ణీత వ్యవధిలో సేవలందించలేకపోతే దరఖాస్తుదారునికి రోజుకు ఇంతని జరిమానా చెల్లించేలా ఏర్పాటు చేస్తూ 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని తీసుకురావాలని లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా అందుకే పోరాడుతోంది. ఇలాంటి సిటిజన్ ఛార్టర్ల చట్టం అవినీతి ఎక్కువగా ఉన్న రెవెన్యూ శాఖలో అవసరమని కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా మాట వరసకు మాత్రం కేసీఆర్ అన్నారు. అవినీతిలో తక్కువ ఎక్కువ ఉండవు ముఖ్యమంత్రి గారూ!.. ప్రజలకు నిజంగా మేలుచేయాలని ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే అన్ని శాఖల్లోనూ సర్వీస్ గ్యారంటీ చట్టం అమలు చేయాల్సిందే.

### ముందే హెచ్చరించినా ...

హైదరాబాద్‌లో ఈ ఏడాది సెప్టెంబర్‌లో కుంభవృష్టి కురవొచ్చని రెండు మూడు నెలల ముందే వాతావరణ

అధ్యయనాలు చెప్పాయి. అనేకమార్లు ఈ విషయాలు మీడియాలో కూడా వచ్చాయి. అయితే వర్షాలు ఊహించనిరీతిలో కురిస్తే ఎలాంటి నష్టం వస్తుందో దాదాపు అంతే నష్టం జరిగింది. మన నగరపాలక శాఖ, ప్రభుత్వంలో ఏమాత్రం సన్నద్ధత లేదు. సెప్టెంబర్‌లో సాధారణంగా కురవాల్సిన వాన 8.4 సెంటీమీటర్లయితే, ఈ ఏడాది నెల మూడవ వారం నాటికే 448శాతం అధికంగా 46.2 సెంటీమీటర్లు నమోదైందని, 1908 తర్వాత ఇది రికార్డని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ వర్షం వల్ల నష్టం చూశాక అందుకు ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉన్న అక్రమ నిర్మాణాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కూలగొడతామని హెచ్చరించారు. దాదాపు 28,000 అక్రమ నిర్మాణాలున్నాయని తెలిపారు. ఇదే పనిని సెప్టెంబర్‌లో అసాధారణ వర్షాలు పడతాయని హెచ్చరిక వచ్చినప్పుడే ఎందుకు చేయలేదు ముఖ్యమంత్రిగారూ? కనీసం శిథిల భవనాలను కూడా కూల్చడం చేతగాలేదు. 100రోజులలో హైదరాబాద్‌ను ప్రాథమికంగా బాగుచేసి చూపిస్తామని మునిసిపల్ ఎన్నికల సమయంలో మీ పార్టీ ఇచ్చిన హామీలేమయ్యాయి? విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని 2014 ఎన్నికలలో ఇచ్చిన హామీలేమయ్యాయి? ఎన్నికలలో ఓట్ల కోసం, వ్యక్తిగత గొప్పల పందేరాలకు ఆదాయం కోసం అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించిన (2008 నుంచి తెరాస ప్రభుత్వం స్కీము ప్రకటించేనాటికి దాదాపు లక్షన్నర అక్రమ కట్టడాలున్నాయని అంచనా) మీ ప్రభుత్వానికి ఇప్పుడు కూలగొడతామనే నైతికహక్కు ఎక్కడుంది? అవినీతి ఉద్యోగులపై చర్య తీసుకుంటే బల్దియాలో ఒక్కరూ మిగలరన్న మీరు 'సర్వీస్ గ్యారంటీ' చట్టం అమలు వంటి ఏర్పాట్లు చేయకుండానే ఉద్యోగుల జీతాల్ని 43శాతం మేర ఎలా పెంచారు? ఏతావాతా నగరాన్ని హైటెక్ సిటీ చేసే పేరుతో అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర రెడ్డి చేసిన ఆక్రమణలు-క్రమబద్ధీకరణల పాలననే అటూఇటుగా మీరూ కొనసాగిస్తున్నారు కేసీఆర్ గారూ!

పాత అవినీతి చరిత్ర నుంచి నగరం విషయంలో సమస్యలు లేవు కాబట్టి, తగిన విధానాలను అనుసరించి హైదరాబాద్‌ని ప్రక్షాళన చేయటానికి కేసీఆర్‌కి ఇదో సువర్ణావకాశం. కానీ ఉక్కుపాదం మోపుతామని హుంకరించినంత సులభం కాదు, ఉక్కుసంకల్పంతో మార్పు తీసుకురావటం. నగరంలో 390 కిలోమీటర్ల మేర నాలాలు ఉంటే చాలావరకూ ఆక్రమణలకు గురయ్యాయి. అతిపెద్ద కూకట్‌పల్లి నాలాను బాగుచేయడానికి 2009-14లో శాసనసభ్యునిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ బృహత్‌ప్రయత్నం చేశారు. అయిదేళ్లలో ఆయన 500-600సార్లు కూకట్‌పల్లిని సందర్శిస్తే అందులో చాలాసార్లు నాలాల ప్రక్షాళన పని మీద కూడా దృష్టిసారించేవారు. పార్టీలతో సంబంధంలేకుండా కార్పొరేటర్లను కూడా భాగస్వాముల్ని చేసేవారు. రాష్ట్రంలో పాలన అనిశ్చితంగా ఉన్నా, పార్టీ తరపున ఒకే ఒక్క ఎమ్మెల్యే అయినా నియోజకవర్గంలో రూ.1600కోట్ల మేర అభివృద్ధి పనులను జేపీ ప్రారంభించారు. రోడ్ల విస్తరణను, అవసరమైతే కేంద్రంతో కూడా మాట్లాడి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫ్లైవోవర్ వంటివి పూర్తి చేయించారు. కరెంట్ పోల్ మీద ఫ్యూజ్ పోయినా 'జేపీ ఎక్కడ?' అని ప్రశ్నించిన కూకట్‌పల్లివాసులు ఈసారి వాన ముంపు కష్టాల్లో కనీసం ఎమ్మెల్యే, ఎంపీ పేరు కూడా ప్రస్తావించలేకపోయారు. అలాంటి దుస్థితిలో మన రాజకీయం, స్థానిక పాలన ఉన్నాయి. మీడియా తప్ప అక్కడ గోడు వినేవారు లేకపోయారు. పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు సందర్శించినా కేంద్రీకృత పాలన, అవినీతి, అసమర్థ బ్యూరోక్రసీలో ఆయన తక్షణం చేయగలిగిందేమీ లేకుండా పోయింది. ప్రత్యక్ష కథనాలు, పతాక శీర్షికలతో హోరెత్తించి పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని బంధుమిత్రుల్ని కలవరపరిచినా, నాలాలను,



చెరువులను ఆక్రమించి కట్టిన ఇళ్లకు పర్మిషన్లు ఇచ్చి ఇంకా జీహెచ్ఎంసీలోనే కొనసాగుతున్న అధికారులు, వారికి సహకరించిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల జాబితాలో ఒక్క పేరును కూడా మీడియా సైతం చూపలేకపోయింది. జీహెచ్ఎంసీలో ఇంజినీర్ల కొరత ఉండటం వల్ల అధికారులు అవగాహన లేక పర్మిషన్లు ఇచ్చారనటం సాకు మాత్రమే.

### కమిషనర్ కప్పదాటు వైఖరి

హైదరాబాద్‌లో వర్ష బీభత్సంపై జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందిస్తూ, ప్రజలు పేదవారయితే ప్రభుత్వాలు పేదవవుతాయని నిధుల కొరత గురించి చెప్పుకొచ్చారు. ఆడ లేక మద్దెల ఓడులాగా ఉందిది. జీహెచ్ఎంసీ బడ్జెట్ 2015-16లో రూ.6,400కోట్లు. జీతాలు రూ.700కోట్లు పోగా మిగిలిన డబ్బుల్ని బట్టి చూస్తే ఒక్కో పౌరుడు/పౌరురాలి మీద దాదాపు ఏటా రూ.7,000 ఖర్చు చేస్తున్నారు. ఇదేమీ మరీ తక్కువ డబ్బు కాదు. ఇంతకంటే తక్కువ తలసరి ఆదాయం ఉన్న పట్టణాలు అద్భుతంగా ఎదిగిన

దాఖలాలు మనముందున్నాయి. మన దగ్గర సరైన పాలనా విధానాలు లేవు, పబ్బం గడుపుకోవటం తప్ప నేర్చుకునే ఉద్దేశం లేదు. అదీ అసలు సమస్య. ఆ తర్వాత.. మునిసిపల్ ఎన్నికలలో ఓట్ల కోసం ఆస్తిపన్ను రద్దుచేసిందెవరు? ప్రజలకు వారి పన్నుల డబ్బుకు తగ్గ సేవలు అందిస్తుంటే ఆస్తి పన్ను పెంచినా కూడా అత్యధికులు కడతారు కదా! పరిమిత వనరుల మధ్య అపరిమిత అవసరాలను తీర్చే పాలనా సంస్కరణల గురించి కూడా కమిషనర్ సూచనప్రాయంగా కూడా చెప్పలేకపోయారు. మనకున్న బలం మానవ వనరులు, అందులోనూ యువత. స్థానికంగా వార్డుల్లో ప్రజలకు అధికారాలను, నిధులను ఇచ్చేస్తే పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల నిర్వహణ, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పోలీసింగ్ వంటివి ఒకస్థాయి వరకూ వాళ్లే చూసుకుంటారు. మొత్తం నగర ప్రణాళికలో భాగంగా, స్థానికంగా చేయలేని స్థాయిలోనే పారిశుద్ధ్య, డ్రైనేజీ, రోడ్లు వంటి వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగాలి. అది కూడా మేయర్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని. అప్పుడు ప్రజల సామర్థ్యమే వేలకోట్ల రూపాయల ఫలితాలను సాధించి చూపిస్తుంది. పెత్తనమంతా ముఖ్యమంత్రి, మంత్రి చేతిలోనే ఉండాలనే రాచరిక, భూస్వామ్య ధోరణులు లేకపోతేనే మన ప్రజలకున్న సత్తా బైటికొస్తుంది. అలాగే, హైదరాబాద్‌లో 9,000 కిలోమీటర్ల మేర ఉన్న రహదారి వ్యవస్థలో 5,000 కిలోమీటర్లు సింగిల్ రోడ్లున్నాయని, 45 లక్షల వాహనాలు నగరంలో ఉన్నాయని, వాహనాల మధ్య ప్రయాణదూరం రెండు మీటర్లు కూడా ఉండటం లేదని, మెట్రో రైలు పనులు నడుస్తున్నాయని, ఈ రోడ్ల మీద గుంట పడినా రిపేరు చేయాలంటే అర్ధరాత్రి వరకూ ఆగాల్సిందేనని, రోజుకు 2,000 గుంతల్ని పూడుస్తున్నామని కమిషనర్ లెక్కలు ఏకరువు పెట్టారు. వేసిన ఒక్కరోజులోనే గుంతలు పడి దుమ్మురేపుతున్న రోడ్లు ఎందుకున్నాయి, రోడ్ల వైఫల్యానికి కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను ఎందుకు బాధ్యుల్ని చేయలేకపోతున్నాం, ప్రైవేటు వాహనాలను తగ్గించేలా నాణ్యమైన ప్రజారవాణా వ్యవస్థను ఎందుకు అభివృద్ధి చేయలేకపోతున్నాం వంటివి కూడా ప్రభుత్వం జవాబుచెప్పాల్సిన ప్రశ్నల జాబితాలో ఉన్నాయి. నగరంలో ఇంత పెద్ద వర్షం కురిసినా 5శాతం నీరు కూడా భూమిలోకి ఇంకి ఉండదని కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. నీటి నిల్వకు రూపొందించిన కందకాల చుట్టూ సిమెంటు వాడకుండా రాతికట్టడాలు చేపట్టాలని, వీధుల్లో, రోడ్లలో కూడా ఇలాగే చేస్తే 80శాతం నీరు భూమిలోకి ఇంకుతుందని మాజీ చీఫ్ ఇంజినీర్, ఐరాస సలహాదారు హనుమంతరావు వంటి వారు పదిపదిహేనేళ్ల క్రితం నుంచి చెబుతున్నా ఎందుకు సమీక్షించలేదో నేతలు, అధికారులే చెప్పాలి. ముఖ్యమంత్రి చెబుతున్నట్టు వేలాది ఇళ్లను కూలగొడితే పునరావాసం వగైరాలకు రూ.12,000 కోట్ల పైచిలుకే అవుతుందని అంచనా. ఈ డబ్బును బాధ్యుల నుంచి వసూలుచేయగలరా? అమాయకంగా కొనుగోలుచేసిన సామాన్యులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం ద్వారా ప్రత్యామ్నాయం చూపుతారా? మరోమార్గముందా? ఇవన్నీ కూడా ప్రభుత్వం స్పష్టం చేయాలి.

**ఏరకంగా చూసినా.. హైదరాబాద్‌లో ఈ సెప్టెంబర్‌లో కురిసిన కుంభవృష్టి మన రాజకీయ, పాలనా విధానాల్లో కీలక మార్పులు చేయాలని స్పష్టంగా హెచ్చరించే ప్రమాద ఘంటిక. అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రాల్లోనూ కూడా.**

నగరపాలనకు సంబంధించి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న 'స్మార్ట్ సిటీస్' పథకాన్ని సమూలంగా మార్చాలి. 100 ఆకర్షణీయ నగరాలను తయారుచేయటం తమ లక్ష్యమని మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్య నాయుడు అట్టహాసంగా ప్రకటించారు. ఇప్పటికే 33 పట్టణ ప్రాంతాలను స్మార్ట్ సిటీలకు అర్హత సాధించినవిగా ప్రకటించారు. మరో విడత ప్రకటించటానికి సిద్ధమవుతున్నారు. సుమారు రూ.48,000కోట్లతో 100 స్మార్ట్ సిటీలను రూపొందించటంతోపాటు స్మార్ట్ సిటీలకు అర్హత సాధించేలా మరో 500 పట్టణాలు, నగరాలను అభివృద్ధి పరచేందుకు 'అమృత్' (అటల్ మిషన్ ఫర్ రీజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) అనే పథకాన్ని ఇంకో రూ.50,000 కోట్లతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇలా ఐదేళ్ల వ్యవధిలోనే పట్టణ ప్రాంతాలను స్మార్ట్ చేస్తామని, బడ్జెట్ రూ.లక్షన్నర కోట్లకు చేరినా వెనకాడబోమని పట్టణాభివృద్ధి శాఖ చెబుతోంది. ఈ పథకాలలో రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలు మ్యాచింగ్ గ్రాంట్లు సమకూర్చటం వల్ల మొత్తంగా సుమారు రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు ప్రవహిస్తాయని, ఇవికాక ప్రభుత్వ-ప్రయివేటు నమూనా (పీపీపీ)లో భాగంగా ప్రయివేటు పెట్టుబడులు కూడా వస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది. నిధులు, కేంద్రం-రాష్ట్రాలు-స్థానిక ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయనటం బాగానే ఉంది, కానీ స్థానికంగా అవసరమైన మౌలిక వసతుల నిర్మాణానికి స్మార్ట్ పథకాలు పరిష్కారం చూపగలుగుతాయా అన్నదే ప్రశ్నార్థకం. స్మార్ట్ సిటీల కింద కేంద్రం మౌలిక వసతుల నిర్మాణం, విద్యను మెరుగుపరచటం వంటి అంశాలన్నిటినీ ఏకరువుపెట్టినా ప్రధానంగా చేస్తున్న పనిని సాంకేతికత జోడింపుతో ఆకర్షణీయంగా చేయటమే స్మార్ట్ సిటీల లక్ష్యం. కేవలం ఇలాంటి స్మార్ట్ పథకాలతో నగరాలు అభివృద్ధి చెందుతాయన్న వాదనకు ఇతర దేశాల్లో అనుభవాలు విరుద్ధంగా ఉన్నాయి. లక్ష కోట్లకు పైగా జనం సొమ్ము ఖర్చు చేస్తున్నప్పుడు ఇదంతా బేరీజు వేయటం పాలకుల ప్రథమ కర్తవ్యం. మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగలార్చే సింగపూర్‌నే తీసుకుంటే.. వరదల్ని, చివరికి వాహనాల పార్కింగ్‌ని కూడా లెక్కచెప్పే సెన్సర్లతో పాలన స్మార్ట్‌గా ఉంటుంది. కానీ ఈ

డిజిటల్ యుగానికి ముందు కొన్ని దశాబ్దాలపాటు ఆ నగరంలో మౌలిక వసతులు, స్థానిక పాలన, ప్రజల భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన వంటివి అభివృద్ధి చేసుకోవటం వల్ల ఇప్పుడు స్మార్ట్ పాలన విజయవంత మవుతోందని మనం గుర్తించాలి. బస్సుల్లో వై-ఫై ఏర్పాటు చేసేముందు నాణ్యమైన ప్రజారవాణా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటం అవసరమా? కాదా? మురికివాడలు, ట్రాఫిక్ చిక్కులు, ఒడిదుడుకుల విద్యుత్ మధ్య స్మార్ట్ సిటీలంటూ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలు, స్మార్ట్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌లకు తొలి ప్రాధాన్యమివ్వటం ఏరకమైన పాలనా నైపుణ్యం?.. స్మార్ట్ సిటీల పథకాన్ని అమలు చేసుకునే ముందు మనం ఈ ప్రశ్నలకు హేతుబద్ధ జవాబులు చెప్పుకోవాలి.

## ముందుగా వార్డుల్లో కనీస ప్రమాణాలు కావాలి

అభివృద్ధి చెందుతున్న దేశాలు చాలా ఈ స్మార్ట్ సిటీల వెనకపరిగెడుతున్నాయి గదా అని మనం అదే పొరపాటును చేయటం తగదు. టెక్నాలజీ కంపెనీలు, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ల స్థాయి విజన్‌ను దాటి ప్రభుత్వాలు ఆలోచించగలగాలి. ప్రపంచస్థాయి అనుభవాలను, దేశీయ పరిస్థితులను మదింపు చేసి ప్రజావిధానాలను రూపొందించాలి. స్మార్ట్ సిటీల వల్ల నిధుల పరంగా, ఇతరత్రా పెద్దగా ఒరిగేదేమీ లేదని అర్థమవటం వల్లో ఏమో మొదట్లో ఈ హోదా కోసం కొట్టుకున్న రాష్ట్రాలు కూడా ఇప్పుడు వాటి గురించి పెద్దగా పట్టించుకోవటం లేదు. హైదరాబాద్‌కు స్మార్ట్ సిటీ ఇవ్వకపోయినా నష్టం లేదని తెలంగాణ ప్రభుత్వం బహిరంగంగానే చెప్పింది.

ఈ నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీల పేరుతో ఓ భారీ నష్ట ప్రయోగం చేయకుండా, వార్డు స్థాయిలో ప్రజలు నేరుగా అవసరాలపై సమష్టి నిర్ణయాలు తీసుకునేందుకు తమ రోజువారీ పనులకు డబ్బు ఖర్చు చేసుకునేందుకు, వేగంగా పనులు పూర్తయ్యేందుకు 'వార్డు పాలన' విధానాన్ని తీసుకురావాలి. (జీహెచ్ఎంసీ ఎన్నికలలో.. 2009లో, 2016లో కూడా లోక్‌సత్తా 'వార్డు ప్రభుత్వాల' హామీతో మేనిఫెస్టోను ప్రజల ముందుంచింది) తలసరి ప్రతి పౌరుని మీద ఏటా రూ.1000-2000 నేరుగా వార్డుకు కేటాయించే ఏర్పాటు చేయాలి. ఎన్నికైన వార్డు కమిటీలు, కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఈ నిధుల్ని ఖర్చు చేస్తాయి. 2016 ఫిబ్రవరిలో ఎన్నికైన జీహెచ్ఎంసీ పాలక మండలి మొక్కుబడిగా వార్డు కమిటీలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోంది. పట్టణ స్థానిక ప్రభుత్వాలకు వార్డు స్థాయిలో అధికారాలిచ్చి తలసరి కేటాయింపు చేయటంలో 74వ రాజ్యాంగ సవరణ విఫలమవటం వల్లే మన నగరాలు ఇంకా ఇష్టారాజ్యంగా ఉండే పెద్దసైజు పల్లెటూళ్లలా కొనసాగుతున్నాయని కేంద్రం స్పష్టంగా గుర్తించాలి. జవాబుదారీతనంతో కూడిన వార్డు ప్రభుత్వం ఏర్పాటుతో పట్టణ ప్రాంతాలు కనీస ప్రమాణాలకు చేరుకున్నాకే స్మార్ట్ సిటీల భావనను జోడించాలి. అది కూడా వార్డు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. ప్రభుత్వాధికారుల నుంచి లంచాలు, వేధింపులు లేకుండా పనులు జరిగేందుకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని అమలు చేయాలి. నిధుల్ని తలసరి అందించటం, ఫలితాలను బేరీజు వేయటం, అక్కడ తప్పు జరిగితే చర్య తీసుకునే జవాబుదారీ వ్యవస్థను ఏర్పాటు చేయటం వరకే కేంద్రం పరిమితం కావాలి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాల్ని కూడా భాగస్వాముల్ని చేయాలి. ఇలా చేయగలిగితే స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు కూడా విజయవంతమవుతాయి, పాలకులకు నగర ప్రజల ఓట్లు స్మార్ట్‌సిటీల స్కీము వల్ల కంటే బాగా పెరుగుతాయి.



## 33 శాతం స్థానిక పాలనకు ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వం 74వ రాజ్యాంగ సవరణలోని లొసుగుల్ని ఆసరాగా చేసుకుని పట్టణాలు, నగరాలకు అధికారాలను, నిధులను తన మోచేతి కింద ఉంచుకుంటోంది. ఈ తప్పిదాన్ని రాష్ట్రాలు సవరించుకునేలా కేంద్రం చొరవ తీసుకోవాలి. స్థానిక పాలనలో కేంద్రంలాగే రాష్ట్రం కూడా జోక్యం చేసుకోకుండా చేసి వార్డు ప్రభుత్వాల నిర్వహణ స్వతంత్రంగా ఉండేలా చేయాలి. స్థానికంగా నిధుల్ని, అధికారాల్ని కేటాయించటంలో, వార్డు ప్రభుత్వాల ఏర్పాటులో కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో వ్యవహరించి.. కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో కచ్చితంగా 33శాతాన్ని స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాలి, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఎన్నికైన వార్డు ప్రభుత్వాల్ని ఏర్పాటు చేయాలి. కేంద్రం నిధులకు మ్యాచింగ్ నిధులను వార్డులకు రాష్ట్రాలు సమకూర్చాలి. స్థానిక అవినీతి ఫిర్యాదులపై పర్యవేక్షణకు రాష్ట్రాలు యంత్రాంగాలను ఏర్పాటు చేసుకోవాలి. మునిసిపల్ వ్యవస్థలపై ముఖ్యమంత్రి, మంత్రుల పెత్తనం లేకుండా మేయర్‌లకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించి అధికారాలను బదిలీ చేయాలి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎంపీలకున్న అధికారాలను తొలగించాలి. స్మార్ట్ సిటీల కంటే ముందు పట్టణ ప్రాంతాలకు చేయాల్సిన మౌలిక పాలనా మరమ్మతులివి. కానీ ఈనెల ఈక్వెడార్ రాజధాని క్విటోలో హాబిటాట్-3 పేరుతో జరగనున్న ప్రపంచ పట్టణాభివృద్ధి సదస్సు సందర్భంగా కేంద్ర

పట్టణాభివృద్ధి శాఖ విడుదల చేసిన భారత ఆవాస ప్రాంత జాతీయ నివేదిక-3లో కూడా ఈ అంశాల్ని పట్టించుకోలేదు. ఇంతవరకూ కనీస వసతుల కల్పనపైనే దృష్టి సారించగా, ఇకపై పట్టణీకరణకు భారీ ప్రోత్సాహం ఇస్తామని ప్రపంచ ఆవాస ప్రాంత దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 3న నివేదికను విడుదల చేస్తూ కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన మంత్రి వెంకయ్య నాయుడు అన్నారు. ఇప్పుడున్న విద్యుత్తు, నీటి వినియోగంలో 50శాతాన్ని ఆదా చేయడం, పట్టణాల్లో 60శాతం మంది ప్రజారవాణా వ్యవస్థను వినియోగించేలా చేయటం వంటి పొదుపు కార్యక్రమాలను వచ్చే 20 ఏళ్ల లక్ష్యాలుగా ఏర్పరుచుకున్నామన్నారు. 'ఇళ్ల నిర్మాణమే కీలకం' అన్న నినాదాన్ని ఈ ఏడాది ప్రపంచ ఆవాస దినోత్సవానికి ఎంచుకున్నామన్నారు.. ఇవన్నీ అవసరమేగానీ పునాది లేదన్న విషయాన్ని మంత్రి అంగీకరించటం లేదు. ఉన్న పునాది మీదే లాగించేద్దాం, జనం, తర్వాతి తరాలు వాళ్ల అవస్థ వాళ్లు పడతారు అన్న ధోరణిలో హాబిటాట్ విజన్‌ను రూపొందించారు. ఎంతో ప్రణాళికాబద్ధంగా ఉన్న జంషెడ్‌పూర్‌లోనే అసాధారణ సందర్భాల్లో ముంపు సమస్యలు తలెత్తుతుంటాయి, అటువంటిది అధ్వాన్న పునాదుల మీద స్మార్ట్ సిటీలను కడితే అవి ఎంతకాలం మనగలుగుతాయి?

### వికేంద్రీకరణ విజయాలు

మనదేశంలో ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే రోజువారీ సేవలను అందించటంలో సాధించిన విజయాలన్నీ స్థానిక స్వయంపాలనతో, వికేంద్రీకరణతో వచ్చాయి తప్ప కేంద్ర హుకుంలు, నియంత్రణల ద్వారా కాదు. తమిళనాడులోని అలందూర్ మునిసిపాలిటీ 80,000 జనాభా ఉన్న ఓ చిన్న పట్టణం (ప్రస్తుతం చెన్నై కార్పొరేషన్‌లో భాగంగా ఉంది). స్థానిక వనరులతో, పౌరుల మద్దతుతో చక్కటి పారిశుద్ధ్య వ్యవస్థను నిర్మించుకున్న మొట్టమొదటి చిన్న పట్టణం ఘనతను అలందూర్ సాధించింది. దీంతో, అక్కడి ప్రజలకు కొద్దికాలంలోనే పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సుందరీకరణ వంటి లాభాలతో పాటు ఇళ్ళ స్థలాల ధరలు భారీగా పెరిగిపోయాయి. రోజువారీ చాలా అంశాలను స్థానికంగానే సమర్థవంతంగా నిర్వహించుకున్న మన సుదీర్ఘ చరిత్రను చూస్తే స్థానిక ప్రభుత్వాలను నిర్లక్ష్యం చేయటం ఒక అసాధారణ వైఫల్యంలా కనిపిస్తుంది. బ్రిటీష ఇండియా వలస పాలనలో కూడా స్థానిక పాలనకు గణనీయ ప్రాధాన్యత కల్పించారు. 1688లో ఏర్పాటు చేసిన మద్రాసు కార్పొరేషన్.. బ్రిటన్‌కమినహా మిగిలిన కామన్వెల్త్ దేశాల్లోనే మొట్టమొదటిది. కానీ స్థానిక పాలనలో కీలక మలుపు 1919 భారత ప్రభుత్వ చట్టం. ప్రజాదరణ గల మంత్రి నిర్వహించే విభాగానికి స్థానిక ప్రభుత్వ బాధ్యతను బదిలీ చేయటం, స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు ఓటర్ల పరిధిని గణనీయంగా విస్తరించటం, పన్నులను నిర్ణయించే అధికారాన్ని మునిసిపల్ సంస్థలకు అప్పగించటం, ఎన్నికైన కౌన్సిళ్ల ఏర్పాటు, ఎన్నికైన ఛైర్మన్‌కి కార్యనిర్వాహక అధికారాలు తదితర మౌలిక మార్పులన్నీ అక్కడ్నుంచే వచ్చాయి. 1924లో అనేకులు ప్రముఖ భారత స్వాతంత్ర్యయోధులు స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన మేయర్లు అయ్యారు. కలకత్తాలో చిత్తరంజన్ దాస్, అహ్మదాబాద్‌లో వల్లభాయ్ పటేల్, పాట్నాలో రాజేంద్ర ప్రసాద్, అలహాబాద్‌లో నెహ్రూ మేయర్లుగా ఎన్నికయ్యారు.

### బూజు పట్టిన సాఫ్ట్‌వేర్‌ని వదిలించుకోవాలి

మెదళ్లలోని బూజు పట్టిన సాఫ్ట్‌వేర్‌ని వదిలించుకుని ఇప్పుడున్న పట్టణ ప్రాంతాలకు ఇలా మౌలిక వసతులు కల్పించటంతోపాటు రానున్న రోజుల్లో వెల్లువలా పెరగనున్న పట్టణ జనాభాను నియంత్రించేందుకు కనీసం 10,000 చిన్న పట్టణాల అభివృద్ధి దిశగా ప్రత్యామ్నాయ ప్రణాళికను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా రూపొందించాలి. స్మార్ట్ సిటీల పథకంలో నగరీకరణను, పట్టణ ప్రాంతాల అభివృద్ధిని దాదాపు సమానార్థంలో చూశారు. మౌలిక వసతులు, వార్డు స్థాయి పాలన, తలసరి కేటాయింపులు వంటి అంశాలలో దాని వల్ల పెద్ద తేడా రాదుగానీ, చిన్న పట్టణాల అభివృద్ధిని నగరాల చుట్టూ శాటిలైట్ ఏరియాల అభివృద్ధిగా, నగరీకరణలో భాగంగా చూడకూడదు. గ్రామాలకు ఆర్థిక కేంద్రాలుగా ఉండే చిన్న పట్టణాలను ఇబ్బడి ముబ్బడిగా అభివృద్ధి చేయటాన్ని ప్రత్యేక కార్యక్రమంగా చూడాలి. కానీ చిన్న పట్టణాలలో సగానికిపైగా చాలా వెనకబడినవేనని, మూడో వంతు మురికివాడలేనని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తాజాగా విడుదల చేసిన 'టౌన్స్ ఆఫ్ ఇండియా' నివేదిక తెలియచేస్తోంది. 1961లో 2223 చిన్న పట్టణాలుండగా ఇప్పుడు వీటి సంఖ్య 160శాతం పెరిగి దాదాపు 6,000కు చేరాయి. కానీ వీటిలో 3354 పట్టణాలు ఎంతో వెనకబడివున్నాయి. కేవలం 24 పట్టణాలకు మాత్రమే పూర్తిస్థాయి మురుగు వ్యవస్థ ఉంది. 1666 పట్టణాలకు 50శాతం కూడా మురుగువ్యవస్థ లేదు. కేవలం 11.2శాతం ఇళ్లకే మురుగుపైపుల వ్యవస్థ ఉంది. ఏడు పట్టణాలైతే ఏకంగా పూర్తిస్థాయి మురికివాడలే.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఆర్థిక చిన్నపట్టణాల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రకటించటం స్వాగతించదగ్గదే అయినా మౌలిక వసతులు, వార్డుస్థాయి పాలన వంటి ఏర్పాట్లు ఏవీ అందులో లేవు. ఈ వసతులు, ఈ రకమైన పాలన లేకుంటే ఇప్పుడున్న పట్టణాలలాగే అధ్వాన్నంగా తయారవుతాయి.

అన్నీ పైన చెప్పుకున్న అలందూర్ వంటి ఆదర్శ పట్టణాలు కాకపోయినా అనేక చిన్న పట్టణాలు ఉండటం వల్ల తమిళనాడులో పట్టణీకరణ నగరాలను ముంచెత్తటం లేదు. ఇలా

## కొసమెరుపు విశాఖ సర్వే హెచ్చరిక

విశాఖ నగరపాలక సంస్థ పాలకమండలి గడువు 2012 మార్చితో ముగిసింది. ఎన్నికలు లేకుండా అధికారుల పాలనతో నాలుగున్నరేళ్లుగా నెట్టుకొస్తున్నారన్నమాట. అధికారుల పాలనపై ఓ ప్రముఖ ఆంగ్లపత్రిక విశాఖ వాసులను సర్వే చేసింది. ప్రజలు ఓ బహిరంగ రహస్యాన్ని ఈ సర్వేలో విస్పష్టంగా వెల్లడించారు. అధికారుల పాలనకి, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాలనకి పెద్దతేడా ఏమీ లేదని వారు తెలిపారు. ఇద్దరు చేసేది ఒకే పనులని పేర్కొన్నారు. కాకపోతే తాము ప్రజాప్రతినిధులను ఓటు పేరుతో నిలదీసి పన్నులు తగ్గించుకోవటం, పనులు చేయించుకోవటం వంటివి చేస్తున్నామని, అధికారుల వద్ద అంత చొరవ తమకు ఉండటం లేదని వారు చెప్పారు.. దీని అర్థం సుస్పష్టం. అధికారుల్లా వ్యవహరిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటం తప్ప ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేస్తున్నదేమీ లేదు. తమ బాధ్యతలైన.. విధానాల రూపకల్పన, చట్టసభల్లో, పాలకమండలి సమావేశాల్లో చర్చించి చట్టాల తయారీ, సృజనాత్మకంగా ఆలోచించి అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే దార్శనికతను అందించటం వంటి పనుల్ని ప్రజాప్రతినిధులు చేయటం లేదు. ఇలా ప్రజలకు పనులు చేసిపెట్టటమే గొప్ప రాజకీయ చతురత, ఎన్నికలలో గెలుపునకు మార్గం అని చంద్రబాబు నాయుడు, కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రులు అనుసరిస్తున్న విధానాన్నే కొనసాగిస్తే లోక్‌సత్తా గతంలోనే హెచ్చరించినట్టు ఈ రోబో రాజకీయాలు, రోబో పాలన చేయటానికి రాజకీయాలలో కూడా రోబో లీడర్లు వచ్చేస్తారు. ప్రజాస్వామ్యం పతనమవుతుంది. అందువల్ల లోక్‌సత్తా తొలి నుంచీ డిమాండ్ చేస్తున్నట్టు 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని అమలుచేసి ప్రభుత్వోద్యోగుల చేత పనిచేయించటం, సమాజంలో సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికలలో గెలిచి విధానాలను రూపొందించే పదవులను చేపట్టేలా ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయటం అవసరం. అలాకాకుండా యథాస్థితినే కొనసాగిస్తూ అంతా బాగుందనే భావనలో కొనసాగితే రాజకీయ పతనం తప్పదు. ప్రభుత్వాధికారులు, రోబోలు, రాజకీయ నాయకులకు మధ్య తేడాని గుర్తెరిగి పట్టణ సంస్కరణలను పాలకులు చేపడతారని భావిద్దాం.

చిన్న పట్టణాలు, వాటిని అలందూర్, గుజరాత్‌లోని రిలయన్స్ కాంప్లెక్స్‌లలాగా తీర్చిదిద్దగలిగే విజన్ ఇప్పుడు కావాలి.

2030 నాటికి దేశ జనాభాలో 25 కోట్ల మంది పల్లెల నుంచి పట్టణాలకు వలసవెళ్తారని అంచనా. పేదరిక నిర్మూలనలో పట్టణ ప్రాంతాలది కీలక పాత్ర అని ప్రపంచవ్యాప్త అనుభవాలు రుజువు చేస్తున్నాయి. నగరాలు ఆర్థిక కేంద్రాలుగా భాసిల్లటం ముమ్ముందు ఇంకా పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం విడిపోతానంటే, హైదరాబాద్ గురించే తప్ప మిగతా అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో పెద్ద వ్యతిరేకత రాలేదు. హైదరాబాద్ ఆదాయం కోల్పోతే ఆర్థికంగా, అభివృద్ధి అవకాశాలపరంగా నష్టపోతామనే ఎక్కువమంది ఏపీ ప్రజలు ఆందోళన చెందారు. నగరాలను ఆర్థిక కేంద్రాలుగా, కొన్ని మహానగరాలను 'గ్రోత్ ఇంజిన్లు'గా అభివృద్ధి చేస్తూ అవి నరకాలుగా మారకుండా వార్డు స్థాయి వికేంద్రీకరణ, సర్వీస్ గ్యారంటీ చట్టం అమలు వంటి పాలనా సంస్కరణల్ని అమలుచేస్తూనే.. పెద్దఎత్తున ప్రజలు గ్రామాల నుంచి నగరాలకు పొట్ట చేత పట్టుకుని తరలిరాకుండా చూడాలి. కొన్ని గ్రామాలకు ఆర్థిక కేంద్రంగా ఓ చిన్న పట్టణం ఉండేలా పట్టణాల అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలి. ఏ ఊరు నుంచి ఆ పట్టణానికి వచ్చినా ఓ గంటలో తిరిగి తమ గ్రామానికి ప్రజలు తిరిగివెళ్లగలిగేలా సౌకర్యవంతంగా చిన్న పట్టణాలను అభివృద్ధి చేస్తే చాలా వరకూ నగరాల మీద ఒత్తిడి తగ్గుతుంది. ఇలా దేశవ్యాప్తంగా 10,000 చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. లోక్‌సత్తా పలుమార్లు ఈ అంశాన్ని కూడా ప్రజలు, పాలకుల ముందుంచింది. స్మార్ట్ సిటీల బదులు తక్షణం అమలుచేయాల్సిన పట్టణ ప్రణాళికలో ఇది మరో కీలకాంశం.

అభివృద్ధి చెందిన దేశాలు తొలి దశలో అమలుచేసిన సంస్కరణలు మనకు అవసరం లేదని, పట్టణ ప్రాంతాలలో కనీస వసతులు, ప్రజల భాగస్వామ్యంతో పాలన వంటి పునాది లేకుండా స్మార్ట్ సిటీల దశలోకి గెంతేయాలని మన పాలకులు భావిస్తున్నట్టు కనిపిస్తోంది. కానీ పాలన అంటే వీడియో గేమ్ కాదు స్టీరింగ్ తిప్పుతూ నచ్చిన వేగంతో గెంతడానికి. సంస్కరణల సేద్యం లేకుండా సుస్థిరాభివృద్ధి అసాధ్యం. సంస్కరణలను అమలుచేయకుండా, ప్రజల్లో పౌరసత్వం, నాయకత్వం పెంపొందకుండా దేశంలో మనం ఆశిస్తున్న మార్పు తేవటానికి అడ్డదారులేవీ లేవు. ఈ సేవ, మీ సేవ వంటి సాంకేతికతలు అమలవుతున్నా ప్రజలకు ఇంకా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల బెడద ఆశించినంత తగ్గలేదంటే, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటమే ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలవటానికి ఇంకా ఫార్ములాగా ఉందంటే.. మనం వ్యవస్థలపరంగా ఎంత వెనకబడివున్నామో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే మనకున్న సాంకేతికత, యువశక్తి వల్ల ఆ మార్పులకు ఇతర దేశాల్లో తీసుకున్న సమయంకంటే తక్కువ సమయంలోనే మనం మార్పుల్ని సాధించవచ్చు. ఈ వాస్తవాలను గుర్తించి, కోటి జనాభా ఉన్న హైదరాబాద్ అనుభవాన్ని గట్టిగా పట్టించుకుని స్మార్ట్ సిటీల కార్యక్రమం స్థానంలో చట్టబద్ధ పాలనతో నగరపాలనను వార్డు స్థాయికి వికేంద్రీకరించటం, మౌలిక వసతుల ఏర్పాటు, సర్వీస్ గ్యారంటీ చట్టం అమలు, మేయర్ల ప్రత్యక్ష ఎన్నిక, 10వేల చిన్న పట్టణాల అభివృద్ధి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ◆

# మన పట్నాలు పైన పటారాలే!

## దక్షిణాసియా కంటే వెనకబడ్డ భారత్.. హాబిటాట్-3 నివేదికలో వెల్లడి



పట్టణీకరణ లక్ష్యాల సాధనలో భారతదేశం పెద్దగా సత్ఫలితాలను సాధించలేకపోయిందని గ్లోబల్ అర్బన్ ఫ్యూచర్స్ ప్రాజెక్ట్ (జీయూఎఫ్‌పీ) నివేదిక తెలిపింది. సంస్థాగత నిర్మాణం (ఇన్‌స్టిట్యూషనల్ బిల్డింగ్), మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మన దేశం దిగదుడుపు స్థాయిలోనే ఉందని స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి సారథ్యంలో 'హాబిటాట్-3' పేరుతో ఈక్వడార్ రాజధాని క్విటోలో అక్టోబర్‌లో తలపెట్టిన ప్రపంచ పట్టణీకరణ సదస్సు సందర్భంగా కొందరు విద్యార్థులు, సామాజిక ఉద్యమకారులు విస్తృత కసరత్తు చేసి ఈ నివేదిక రూపొందించారు.

సుస్థిర పట్టణాభివృద్ధిపై ఐక్యరాజ్యసమితి హాబిటాట్ సదస్సుల్ని నిర్వహిస్తుంది. హాబిటాట్-1 కెనడాలోని వాంకూవర్‌లో 1976లో జరిగింది. తర్వాత ఇరవై ఏళ్లకు 1996లో టర్కీలోని ఇస్తాంబుల్‌లో రెండో సదస్సు నిర్వహించారు. హాబిటాట్-3 ఈనెల క్విటోలో జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇరవై ఏళ్ల క్రితం జరిగిన సదస్సులో నిర్ణయించిన లక్ష్యాలు ఏమేరకు సాధించిందీ చర్చించుకొని నూతన లక్ష్యాలను నిర్దేశించుకోవడం ప్రస్తుత సదస్సు ప్రధానోద్దేశం.

దక్షిణాసియా దేశాల్లో వివిధ అంశాల్లో భారత్ కంటే వెనకబడివున్న దేశాలు కూడా పట్టణీకరణకు సంబంధించి కొన్ని అంశాల్లో ఉన్నత ప్రమాణాలు కనబర్చాయని నివేదిక తెలిపింది. నేపాల్, పాకిస్తాన్ ఇందుకు ఉదాహరణ. చైనా కొన్ని అంశాల్లో మెరుగ్గా, మరికొన్ని అంశాల్లో వెనకబడివున్నా, పేదరిక నిర్మూలనలో ఆ దేశం గొప్ప ప్రగతిని నమోదుచేసింది.




### చైనా సంగతి

- చైనా గత 20 ఏళ్ల కాలంలో తలసరి ఆదాయంలో అనూహ్యమైన వృద్ధిని సాధించింది. 1996లో సగటు చైనా పౌరుడి ఆదాయం 2,700 డాలర్లుకాగా, 2014నాటికి 12,000 డాలర్లకు పెరిగింది.
- చైనా పట్టణ జనాభా 96శాతం పెరిగింది. జనాభా 70లక్షలకు పైగా ఉన్న నగరాలు చైనాలో 10. వీటిలో షాంఘై, బీజింగ్, టియాంజిన్ పెద్దవి.
- సంస్థాగత నిర్మాణం, నివాస సదుపాయాలు, సుస్థిరాభివృద్ధి విషయాలలో చైనా ఇంకా కిందకు దిగజారింది.
- విద్యుదుత్పత్తి కోసం చైనా కూడా బొగ్గు మీద అధికంగా ఆధారపడుతోంది
- కొన్ని ప్రమాణాల్లో చైనా వెనుకంజలో ఉన్నప్పటికీ పేదరికాన్ని తగ్గించటలో అనూహ్య విజయాలు సాధించింది. గత 30 ఏళ్ల కాలంలో చైనాలో 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి విముక్తులయ్యారు.
- చైనాలో ఏకపార్టీ పాలనపై విమర్శలను ప్రభుత్వం సహించదు. సోషల్ మీడియాపై గట్టి ఆంక్షలు అమల్లో ఉన్నాయి.

## భారత్ ఎక్కడుంది?

- 130 కోట్ల జనాభా ఉన్న భారత్ గత 20 ఏళ్ల కాలంలో ఆవాస నిబద్ధతా సూచీ (హెచ్‌సీఐ) విషయంలో ఏమాత్రం ముందంజ వేయలేకపోయింది. భారతదేశం హెచ్‌సీఐ సూచీ 0.41 పాయింట్ల మేర దిగజారింది.
- వ్యవస్థల నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటులో మన దేశం బాగా వెనకబడి ఉంది.
- పేదరికాన్ని తగ్గించటంలో మాత్రం కొంతమేర ఫలితాలను సాధించగలిగింది. కానీ ఆర్థిక అసమానతలు బాగా పెరుగుతున్నాయి.
- దేశంలోని ఆరు పెద్ద నగరాలలో జనాభాపరంగా ముంబయి పెద్దది. ఈ నగరాల్లో 50 లక్షలకు పైగా జనాభా ఉండగా, ముంబయిలో 1.5కోట్ల మంది ఉన్నారు.
- స్త్రీ, పురుష సమానత్వం ప్రభుత్వ ప్రధాన ఎజెండాకాగా, ఆచరణలో అది పూర్తిగా సాధ్యపడటం లేదు. దీనికి భారతీయ సమాజంలో ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయిన పితృస్వామ్య ధోరణులు ప్రధాన కారణం. ఇళ్లల్లో, పనిచేసే ప్రదేశాల్లో మహిళలు ద్వితీయ శ్రేణి హోదాతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.
- ప్రాథమిక, సెకండరీ విద్యలో బాలురు, బాలికల నిష్పత్తి సమానంగా ఉంది. గత రెండు దశాబ్దాలలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న మహిళల సంఖ్య బాగా పెరిగింది. కానీ ఉద్యోగ, ఉపాధి రంగాలలో మహిళల సంఖ్య తక్కువగా ఉంది. భారతదేశంలోని 40 కోట్ల కార్మిక శక్తిలో మహిళలు నాలుగోవంతు మాత్రమే.
- దేశంలో 30 కోట్ల మందికి అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్తు లభించటం లేదు. మరోపక్క విద్యుత్తు కోసం భారతదేశం బొగ్గు మీద ఆధారపడటాన్ని తగ్గించాల్సి ఉంది.
- ఇంధనం, నీటి వినియోగాన్ని సగానికి తగ్గించటం, పునరుత్పాక విద్యుత్తు, ప్రజారవాణా వ్యవస్థను ప్రోత్సహించటం రానున్న 20 ఏళ్ల లక్ష్యమని క్యోటో సదస్సు సందర్భంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ విడుదల చేసిన భారత ఆవాస ప్రాంత జాతీయ నివేదిక-3 పేర్కొంది.

## దక్షిణాసియా మనకంటే మెరుగు

దక్షిణాసియా ఆవాస నిబద్ధతా సూచీ గత ఇరవై ఏళ్ల కాలంలో 1.26 పాయింట్లు పెరిగింది. ఈ అంశంలో పాకిస్తాన్, నేపాల్ మెరుగైనా పాయింట్లు సాధించగా, కనిష్ట స్థానంలో బంగ్లాదేశ్, శ్రీలంక ఉన్నాయి. స్త్రీ, పురుష సమానత్వ సాధనలో, పేదరిక నిర్మూలనలో దక్షిణాసియా దేశాలు మెరుగుపడ్డాయి. కానీ ఉపాధి కల్పన, సంస్థాగత నిర్మాణంలో వెనుకబడ్డాయి.

ఒక్కో దేశం ఎక్కడున్నదీ తెలుసుకోవటానికి వీలుగా ఆవాస నిబద్ధతా సూచీ (హాబిటాట్ కమిట్‌మెంట్ ఇండెక్స్) రూపొందించారు. ఈ సూచీ ప్రకారం పాకిస్తాన్, నేపాల్ స్కోర్ రెండేసి పాయింట్లు పెరిగింది. భారతదేశం మాత్రం 0.41 పాయింట్లు నష్టపోయింది. దక్షిణాసియా దేశాల సగటు కంటే భారతదేశం వెనుకంజలో ఉండిపోయింది. ఈ సూచీ తయారీకి పలు అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. అందరికీ గూడు, సుస్థిర ఆవాసాలు, స్త్రీ-పురుష సమానత్వం, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం.. తదితర అంశాలను ప్రామాణికాలుగా తీసుకున్నారు.

ఈ నివేదిక ప్రకారం.. గత ఇరవై ఏళ్లుగా ఆసియా దేశాల్లో వేగవంతమైన ఆర్థికాభివృద్ధి కనిపించింది. ముఖ్యంగా చైనా అద్భుతమైన ఆర్థికాభివృద్ధిని సాధించింది. కానీ అదే సమస్య అయింది. పట్టణ జనాభా అదుపులేకుండా పెరిగిపోయింది. పల్లెల నుంచి వలసలు అధికం కాగా, దానికి తగ్గట్టుగా పట్టణాల్లో సదుపాయాలు సమకూరలేదు. పర్యావరణానికి పెనునష్టం వాటిల్లింది. పట్టణాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తాయి. ఆవాస నిబద్ధతా సూచీ (హెచ్‌సీఐ) 1996లో 69.68 ఉండగా, తాజాగా ఇది 71.17 శాతానికి పెరిగింది. అంటే పెరుగుదల 1.49 పాయింట్లు మాత్రమే. అమెరికా, అర్జంటీనా, బ్రెజిల్, పశ్చిమ ఐరోపా దేశాలు కొన్ని మెరుగైన ఫలితాలు కనబరిచాయి. లాటిన్ అమెరికా, ఈశాన్య ఆసియా దేశాలు సైతం ఫర్వాలేదు. కానీ ప్రపంచంలో అత్యధిక జనాభాగల భారత్, చైనా వెనుకబడిపోయాయి. మహిళా సాధికారతలో టర్కీ, యెమన్, గ్రీస్, ఐస్‌ల్యాండ్ మంచి ఫలితాలను సాధించాయి. అదే సమయంలో ఈజిప్టు, జార్జియా, మొరాకో బాగా వెనుకబడిపోయాయి. ◆

# మట్టికాళ్ల మహానగరాలు

- మహేష్ విజాపుర్కార్



ఈ ఏడాది ఫిబ్రవరిలో లాతూరులో తీవ్ర నీటిఎద్దడి ఏర్పడటంతో మన రైల్వేలు మీరజ్ నుంచి 100కుపైగా నీటి రైళ్లను నడిపాయి. తర్వాత, హఠాత్తుగా శుభవార్త వచ్చింది. వానలు కురిసి లాతూరు మంచినీటి అవసరాలను తీర్చే రెండు నీటి వనరులు పూర్తిగా నిండాయి. నీటి సంక్షోభం 'దాదాపుగా ముగిసిపోయింది' అని మునిసిపల్ అధికారులు ఇటీవల ఆనందంగా చెప్పారు. నీటి ఎద్దడి ఆ నగరపు సామాజిక, ఆర్థిక జీవితాన్ని కల్లోలపరిచింది. దీంతో తిరిగి 'సాధారణ' జీవితం గడప వచ్చని అంతా ఆశగా ఎదురు చూశారు.

అయితే ఈ 'శుభవార్త'కు మరో భయ పెట్టే కోణం కూడా ఉంది. "15 రోజులకు ఒకసారి చొప్పున అన్ని ప్రాంతాలకు నీరు సరఫరా కావడం ప్రారంభం అవుతుంది. 'ఇది ఇంతవరకు అనుసరిస్తున్న పద్ధతి, లాతూరువాసులు దీనికి అలవాటుపడ్డారు. రెండు గంటలకు పైగా నీటి సరఫరా చేస్తాం. ఆ నీటిని ప్రజలు ఇళ్లలోని చిన్న ట్యాంకులలోను, పాత్రలు, తదితరాలలో దాచుకుంటారు. ఆ నీరు 15 రోజులకు సరిపోతుంది' అని పౌర పరిపాలన అధికారులు తెలిపారు. ఈ వార్తను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తెలియచేసింది. రెండు వారాలకు ఒకసారా? అది సాధారణమా? తాగడానికి, కడగడానికి, ఉతకడానికి, మరుగుదొడ్లలో వాడడానికి 15 రోజులకు సరిపడా నీటిని నిల్వ చేసుకోగా ఇళ్లలో మిగిలే స్థలం ఎంతో ఊహించండి. తీవ్ర పారిశుద్ధ్య సమస్యతో లాతూరు నగరం మునిగిపోకుండా ఉండటమే ఆశ్చర్యం.

ఈ విషయం రెండు అంశాలను ప్రతిఫలిస్తోంది. ఒకటి, పట్టణ నిర్వహణా ప్రమాణాలు అధమస్థాయిలో ఉన్నాయి. భారతదేశం పట్టణీకరణ చెందడం వల్ల పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సేవలు పెరగడం లేదు కాబట్టి ప్రమాణాలు మరింత దిగజారుతున్నాయి. రెండు, పరిస్థితి ఇంతకంటే మెరుగ్గా ఉంటుందని ప్రజలు ఆశించడం లేదు. మెరుగుపరచమని అధికారులపై ఒత్తిడి తేవడం లేదు. అధికారులు, ప్రణాళికావేత్తల నిర్లక్ష్యం, పౌరుల నిస్సహాయత కలసి దేన్నయినా సహించడంగా మనకు కనబడుతోంది. ఆవశ్యక సేవలన్నిటినీ పూర్తిగా అందించలేకపోతున్నా మనం పట్టణాలను, నగరాలను నిర్మాణంలో ఉన్నవిగా చూస్తుండటం విచిత్రం. ఢిల్లీకి బస్తీలున్నాయి. ముంబయికి మురికివాడలున్నాయి. అంత కంటే చిన్న పట్టణాలకు సైతం వాటికి తగ్గ మురికి ఉంది.

ఈ మురికివాడలకు బయట ఉండే అస్తవ్యస్త పరిస్థితులు సుపరిచితమైనవే.. మరీ ఘోరమైన రోడ్లు, నాణ్యతాపరంగా, పరిమాణంపరంగా కూడా అధ్వాన్న నీటి సరఫరా, నామమాత్రపు

వీధి దీపాలు, కాలువలు, నోళ్లు తెరిచి ఉండే మ్యాన్‌హోల్స్. నగరంలో ఏం ఉంటాయని ఆశిస్తారో అవేవీ నగరాల్లో కనబడవు. పట్టణంలో లేదా చిన్న పట్టణంలోనైనా పరిస్థితి ఇదే.

గ్రామాలు పట్టణాలుగా, ఆ తదుపరి నగరాలుగా వృద్ధి చెందుతాయి. మునిసిపల్ కౌన్సిల్స్ కార్పొరేషన్లుగా ఉన్నతస్థాయికి చేరతాయి. అయినా భూగర్భ నీటిపారుదల మార్గాలు మాత్రం ఉండవు. ఉన్నా, తగురీతిలో ఘనవ్యర్థాల నిర్వహణ ఉండదు. ఈ పట్టణ ప్రాంతాలలోనే ఢిల్లీ బస్తీలు, ముంబయి మురికివాడల వంటి నిర్లక్ష్యానికి గురైన అథో:ప్రపంచాలూ ఉంటాయి. అయినా మన సింధూ నాగరికత ఎంతగా అభివృద్ధి చెందినదో చెప్పుకుంటాం. ఆ నగరాల్లో ఎప్పుడూ పారే నీటి సరఫరా, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, ఇంకుడు గుంతలు ఉండేవని మరచిపోతాం.

పట్టణవాసులు ఈ అల్పస్థాయి ప్రమాణాలను ఎందుకు అంగీకరిస్తున్నారు? ఏళ్ల తరబడి ఈ సమస్యలు సలుపుతుండడాన్ని మరింతగా దిగజారిపోతుండటాన్ని ఎందుకు అనుమతిస్తున్నట్టు? నీరు పునరుత్పాదకమైనదే అయినా ఆ నీటి వనరులను కనుగొని, సక్రమంగా సంరక్షించి, సమర్థవంతమైన ఉపయోగం కోసం తగురీతిలో వాడుకోవాల్సి ఉన్నది. నిజమే. అయితే, ఎప్పుడో ఒకసారి ఆ వనరుకు కొరత ఏర్పడుతుంది లేదా వినాశకరమైనంత ఎక్కువ వచ్చి పడుతుంది. కానీ కాలువలు, పారిశుద్ధ్యం మాత్రం ప్రకృతిపై ఆధారపడినవి కావు. మన పట్టణ ప్రాంతాల లోటుపాట్ల జాబితాలోకి దాదాపు ఏ నగరంలోనైనా ఆవశ్యకంగా, తగినంతగా అందుబాటులో ఉండాల్సినవి అన్నీ చేరతాయి. రవాణా, రోడ్లు, పాదచారుల బాటలు, మార్కెట్లు ఇలా ప్రతిదీ సమస్యాత్మకమే. ఈ మౌలిక సదుపాయాలు కొరవడినా 'స్మార్ట్ నగరాలు' అని మాట్లాడటం హాస్యాస్పదం. అయినా ఈ మట్టి కాళ్లతోనే మన తలలను నక్షత్రాల మధ్య నిలపగలమని విశ్వసిస్తాం. రెండు వారాలకు ఒకసారి నీటి సరఫరా 'సాధారణం' కావడంలో ఆశ్చర్యమేమీ లేదు.

(కర్టెసీ: సాక్షి) ◆

## డబ్బున్నవారికి అందుతున్న చదువును ప్రతి పేదబిడ్డకూ అందించేందుకు పోరాడుతున్నాం : లోక్‌సత్తా

# విద్యార్థి సత్తా అధ్యక్షుడిగా రాజీవ్





అణగారిన వర్గాల పిల్లలకు కూడా సంపన్న వర్గాల పిల్లలు పొందుతున్న అన్ని వసతులతో నాణ్యమైన విద్యను ఉచితంగా అందించి నప్పుడే అంతరాలు తొలగి మనదేశం నిజమైన ప్రజాస్వామిక దేశం అనిపించు కుంటుందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండు రంగారావు అన్నారు. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, లాభసాటి వ్యయసాయం, పాలనా, ఎన్నికల సంస్కరణలు వంటి అంశాలతో లోక్‌సత్తా ప్రజలకు నిజంగా పనికొచ్చే ఎజెండా మీద రాజీ లేకుండా పనిచేస్తోందన్నారు. పార్టీకి అనుబంధంగా విద్యార్థి, యువ, మహిళా, సమతా, రైతు సత్తాలను ఏర్పాటు చేసి అన్ని విధాలా లోక్‌సత్తాను బలోపేతం చేస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థిసత్తా నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. విద్యార్థిసత్తా అధ్యక్షుడిగా పెద్దగళ్ల రాజీవ్, ప్రధాన కార్యదర్శిగా తోట పవన్, ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్ గౌడ్, కార్యదర్శులుగా సాయి చరణ్, సునంద రాజులు ఎంపికయ్యారు.

విద్యార్థిసత్తా విద్యార్థుల సమస్యలపై పోరాడటమేకాకుండా వారిని భవిష్యత్తులో నాయకులుగా తయారుచేసే యంత్రంలా పనిచేస్తుందని నూతన అధ్యక్షుడు రాజీవ్ అన్నారు. రాష్ట్రంలోని 29వేల సర్కారీ బడుల్లో చదువుతున్న ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వం ఏటా రూ.39,000 ఖర్చు చేస్తున్నప్పటికీ సరైన ప్రమాణాలు, పర్యవేక్షణ లేకపోవడం వల్ల మంచి చదువు అందటం లేదన్నారు. విద్యారంగ ప్రక్షాళన కోసం ముమ్ముందు పోరాటాలు చేస్తామని, ప్రతి బిడ్డకూ నాణ్యమైన చదువు అందించటం తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లపు దుర్గారావు, కార్యదర్శి సరోజాదేవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ◆

# నగరీకరణ సవాళ్లను ఎదుర్కోవడమెలా?

-డా॥ జయప్రకాష్ నారాయణ్

గత పదినెలల కాలంలో సంభవించిన అనేక ప్రకృతి వైపరీత్యాలు భారత ఉపఖండాన్ని అతలాకుతలం చేశాయి. డిసెంబర్‌లో విరుచుకుపడిన సునామి, జులైలో ముంబయిని ముంచెత్తిన వరదలు, ఇటీవల ముజఫరాబాద్ కేంద్రంగా భారత్, పాకిస్తాన్‌లను కుదిపేసిన భూకంపం పెను విధ్వంసాన్ని మిగిల్చాయి. ఇంతటి విపత్కర, విపరీత పరిణామాలు చోటు చేసుకున్నప్పటికీ మనం చెప్పుకోదగిన అంశం ఒకటుంది. ఎప్పుడూ నిద్రావస్థలో జోగుతూ ఉంటుందని ముద్రపడిన మన పాలనా యంత్రాంగం ప్రకృతి వైపరీత్యాలను దీటుగా ఎదుర్కొని బాధితులకు సహాయసహకారాలు అందించటం ద్వారా తనలో చేవ తగ్గలేదని చాటుకుంది.




వాస్తవానికి ఇలాంటి సంఘటనలు జరిగినపుడు ప్రభుత్వ స్పందన బాధితులకు తాత్కాలిక సాయం అందించడానికి, కొన్ని సందర్భాలలో పునరావాసం కల్పించడానికి మాత్రమే పరిమితమవుతోంది. ప్రకృతి విపత్తులు మిగిల్చిన అనుభవాల ప్రేరణతో భవిష్యత్తులో వాటిని ఎదుర్కొనేందుకు తగిన సాంకేతిక, వ్యవస్థాపరమైన నూతన ప్రక్రియల్ని మనిషి రూపొందించుకోగలిగాడు. అలా చూస్తే ప్రకృతి వైపరీత్యాలు ఒక విధంగా మానవ ప్రగతికి బాటలు వేసినట్టు లెక్క. చరిత్ర చెప్పిన సత్యమిది. కానీ మనదేశంలో మాత్రం అంతా విధి విలాసమనే సహజసిద్ధమైన ధోరణితో విపత్తులను తేలిగ్గా తీసుకోవటం పరిపాటిగా మారింది. ఈ వైఖరే అన్ని అనర్థాలకు మూలకారణమవుతోంది. ఉదాహరణకు ముంబయి మహానగరాన్నే తీసుకుందాం. ఒక్క రోజులో వెయ్యి మిల్లీమీటర్ల వర్షపాతం కురవడం అసాధారణమైన విషయమే. కాదనలేం. కానీ ముంబయి నగరాన్ని అన్ని వైపులా సముద్రం ఆవరించి ఉంది. సముద్ర మట్టం కంటే నగరం ఎంతో ఎత్తున ఉంది. అందువల్ల, ఎంత వర్షం కురిసినా నగరం నీళ్లలో మునిగిపోవడమనే ప్రసక్తే లేదు. అలా జరిగిందీ అంటే, నగరాభివృద్ధి విషయంలో అధికారులు, పాలకులు దశాబ్దాల తరబడి చేసిన తప్పిదాలే కారణం. ఇప్పటివరకూ తమ నగరం గుండా 'మీటి' నది ప్రవహిస్తున్నదన్న సంగతే చాలామంది ముంబయివాసులకు తెలియకపోవడం ఎంత ఆశ్చర్యకరం! భారీ వరదలు ముంబయి మురుగునీటి పారుదల వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి. 'మీటి' నది గట్లు ఒరుసుకుని మరీ ప్రవహించింది. నగరంలో 63శాతం మంది మురికివాడల్లో నివసిస్తున్నవారే. డ్రెయిన్లు పొంగిపొర్లడంతో.. బతుకుతెరువు కోసం పొట్ట చేతపట్టుకుని నగరానికి వచ్చిన ఈ పేదజనమంతా వీధుల పాలయ్యారు. కనీస వసతుల కల్పనలో పాలకుల నిర్లక్ష్యం

కారణంగా ముంబయి మహానగరం ప్రకృతి విపత్తుకు తలవంచక తప్పలేదు.

**పాలనా విధానాలు మారాలి**

ముంబయిలో తలెత్తిన ఈ పరిస్థితి ఒక విధంగా మనదేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి అద్దం పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో తాండవిస్తున్న పేదరికం, అడుగంటుతున్న జీవన ప్రమాణాల కారణంగా ప్రజలంతా విధిలేని పరిస్థితుల్లో ముంబయికి వలస పోతున్నారు. నగర జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో పారిశుద్ధ్య నిర్వహణ, వసతి, రవాణా, పౌరసదుపాయాల కల్పన వంటివన్నీ గగనకుసుమంగా మారాయి. ప్రజలను ఓటుబ్యాంకులుగానే తప్ప, రక్తమాంసాలున్న మనుషులుగా గుర్తించని రాజకీయ నాయకులు ఏ చిన్న అవకాశం దొరికినా దాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు పాకులాడుతుంటారు. దాంతో సమస్యలు సంక్షోభాలుగా మారి అవి విపత్తులకు దారితీస్తున్నాయి.

మనదేశంలోని నగరాలన్నీ మితిమీరిన జనాభాతో కిటకిటలాడుతున్నాయి. భారతదేశం గ్రామాల్లోనే ఉందని ఒకప్పుడు అనేవారు కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. మన దేశంలోని నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న వారి సంఖ్య 30 కోట్లు. అమెరికా జనాభాకన్నా ఇది ఎక్కువ. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో నగరీకరణ యథాతథ స్థితిలోనే ఉంది. ప్రజలు పెద్దసంఖ్యలో నగరాలకు వలసపోకుండా గ్రామాలు, పట్టణాల్లో ఉండటమే ఇందుకు కారణం. దీనివల్ల అవి క్రమేపీ విస్తరిస్తున్నాయి. ఈ కారణంగా ఆ రాష్ట్రంలో 50శాతం మాత్రమే నగరీకరణ జరిగింది. అదే కేరళ విషయానికొస్తే అక్కడ రాష్ట్రం యావత్తూ నగరీకరణ చెందింది. నగరాలు శరవేగంగా విస్తరిస్తుంటే, చిన్న, మధ్య తరహా పట్టణాల్లో జనాభా పెరుగుదల వార్షిక రేటు ఎనిమిది నుంచి పది శాతం వరకూ మాత్రమే ఉంటోంది. అందువల్ల నగరాలను అశ్రద్ధ చేయడం ఎంతమాత్రం తగదు. అవి ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కార మార్గాలు కూడా మన కళ్ల ఎదుటే ఉన్నాయి. రవాణా, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, ఇళ్ల నిర్మాణం వంటి వసతుల కల్పన కోసం భారీయెత్తున నిధులు వెచ్చించవలసిన అవసరం ఉంది. గ్రామీణుల జీవన స్థితిగతుల్ని మెరుగుపరిచేందుకు, స్థానికంగా ఉపాధి కల్పనకు ఊతమిచ్చేందుకు వీలుగా– పట్టణ ప్రాంత సదుపాయాలను పల్లెలకూ విస్తరింపచేయాలన్న రాష్ట్రపతి అబ్దుల్ కలాం పిలుపు ఎంతో సమంజసమైనది. జల వనరుల సహజసిద్ధ గమనాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, దాని ఆధారంగా నీటి సరఫరా, మురుగునీటి పారుదల, డ్రైనేజీ వ్యవస్థల రూపకల్పన చేయాలని హిమాంశు పారీఖ్ వంటి టెక్నోక్రాట్లు సూచిస్తున్నారు. బిమన్ పటేల్, ఆయన సహచరులు– నగరాలను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దడంపైన, తక్కువ వ్యయంతో రవాణా అవసరాలు తీర్చే విధానాలపైన దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఉందంటున్నారు. ఈ దిశగా కొంకణ్ రైల్వేస్ కొంత ప్రగతి సాధించింది. పట్టణ ప్రాంత ప్రజల రవాణా అవసరాల కోసం అది నూతన సాంకేతిక విధానాలను అభివృద్ధి చేసింది. మరోపక్క పట్టణ ప్రాంత పాలనా విధానాలలో సంస్కరణలు తీసుకురావలసిన ఆవశ్యకతపై 'జనాగ్రహ'కు చెందిన స్వాతి, రమేష్ రామనాథన్ పోరాటం సల్పుతున్నారు. ఆయా రంగాల్లో ప్రముఖులు సూచిస్తున్న ఇటువంటి విధానాలన్నింటినీ పరిశీలించి, ఒక సమగ్ర వ్యూహాన్ని రూపొందించవలసిన అవసరం ఉంది.

పట్టణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం పాలనా విధానాలపైనే ఆధారపడి ఉంటుంది. చైనాలోని షాంఘై నగరంలో రవాణా నుంచి మంచినీటి సరఫరా వరకూ, పోలీసు వ్యవస్థపై నియంత్రణ మొదలు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్వహణ వరకూ అన్ని అధికారాలూ స్థానిక ప్రభుత్వం అధీనంలోనే ఉంటాయి. లండన్ నగరంలో అగ్నిమాపక దళం, పోలీసు వ్యవస్థ వంటి అన్ని విభాగాలపైనా నగర మేయర్‌దే అజమాయిషీ. అక్కడి ప్రస్తుత మేయర్ లివింగ్‌స్టోన్.. లేబర్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అవకాశం దొరక్కపోతే ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి గెలిచారు. ఇక న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్‌సెంటర్ ఉగ్రవాదుల దాడిలో కుప్పకూలిపోయినప్పుడు అప్పటి మేయర్ గ్యూలియానీ పోషించిన పాత్ర– అక్కడి మేయర్‌కు గల అధికారాలేమిటో, బాధ్యతలేమిటో ప్రజల కళ్లకు కట్టింది. మన పొరుగున ఉన్న పాకిస్తాన్‌లో ఆయా నగరాలకు సంబంధించి నజీమ్‌లు, వారి అధీనంలోని కౌన్సిళ్లు తీసుకునే నిర్ణయాల గురించి రాయని జాతీయ వార్తాపత్రికలు ఉండవంటే అతిశయోక్తి కాదు. ప్రపంచవ్యాప్తంగా ధనిక, బీద దేశాలన్న తేడా లేకుండా, అక్కడ ప్రజాస్వామిక ప్రభుత్వాలు కొలువుదీరాయా లేక నిరంకుశత్వం రాజ్యమేలుతోందా అన్న అంశంతో పనిలేకుండా అన్ని దేశాలూ స్థానిక ప్రభుత్వాలకే పట్టం గట్టాయన్న సంగతి గమనార్హం.

మన దేశంలోని నగరాలు, పట్టణాల్లో పరిస్థితి ఇందుకు భిన్నం. కనీసం కొన్ని నగరాల మేయర్ల పేర్లయినా తెలిసినవారు

మనలో ఎందరున్నారు? ఘనత వహించిన మన నగరాల్లో నీటి సరఫరా, రవాణా, మురుగునీటి పారుదల, ఇళ్లు, రోడ్లు వంటి అంశాలను ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధం లేని వివిధ విభాగాలు ఒక్కొక్కటి ఒక్కొక్క అంశం చొప్పున పర్యవేక్షిస్తూ ఉంటాయి. ఈ విధానం వల్ల ఒనగూడే ప్రయోజనాలేమిటో అందరికీ తెలుసు. కుడిచేయి ఏం చేస్తోందో ఎడమచేయికి తెలీని అయోమయ పరిస్థితి. అందరి చేతిలోనూ అధికారం ఉండటం– వారు ఒకరిపైకి ఒకరు నెపాన్ని నెట్టివేస్తూ బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు దోహదపడుతుందే తప్ప దానివల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు.

హైదరాబాద్ నగర జనాభా 2001 జనగణన ప్రకారం 37 లక్షలు కాగా, మునిసిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ 600 కోట్ల రూపాయలు. అంటే తలసరి వార్షిక వ్యయం 1600 రూపాయలన్నమాట. ఇటీవల నగరంలో అభివృద్ధి జాడలు కాస్తో కూస్తో కనబడుతున్నా, రోడ్లు, నీటి సరఫరా, చెత్త తొలగింపు వంటి పౌరవసతుల విషయంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తలసరి వార్షిక వ్యయంలో జంషెడ్‌పూర్ కంటే హైదరాబాద్ ముందున్నా, వసతుల కల్పనలో వెనకబడే ఉంది. జంషెడ్‌పూర్ నగరాన్నే తీసుకుంటే, టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీని కేంద్రంగా చేసుకుని ఆ నగరం ఆవిర్భవించింది. దేశంలోనే ఎంతో వెనుకబడిన జార్ఖండ్ రాష్ట్రంలో జంషెడ్‌పూర్ ఉన్నప్పటికీ, అభివృద్ధిలో దేశంలోని అన్ని నగరాలకంటే ముందుంది. పదిలక్షల జనాభా ఉన్న ఈ నగరంలో పౌరవసతుల కల్పన, నిర్వహణ బాధ్యతలను టాటాస్టీల్ కంపెనీయే నిర్వహిస్తోంది. జంషెడ్‌పూర్‌లో అత్యున్నత ప్రమాణాలతో కొనసాగుతున్న పౌరవసతులు దేశంలోని మరే నగరంలోనూ లేవంటే అతిశయోక్తి కాదు. సురక్షితమైన తాగునీటికి ఆ నగరం పెట్టింది పేరు. రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉంటాయి. చెత్తాచెదారమనేది మచ్చుకైనా కనపడదు. మురుగునీటి పారుదల వ్యవస్థ గురించి చెప్పనే అక్కర్లేదు. టాటా స్టీల్‌కు చెందిన పారిశుధ్య వాహనాలు ఏటా 1,20,000 టన్నుల చెత్తను తొలగిస్తూ ఉంటాయి. కరెంటుకు సంబంధించిన పనులను టౌన్ ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది. ఓ కాలేజీ, పలు పాఠశాలల నిర్వహణ స్థానికంగానే జరుగుతోంది. ఈ వసతుల కల్పనకు అయ్యే మొత్తం వ్యయం ఏడాదికి 139 కోట్ల రూపాయలు మాత్రమే. అంటే.. తలసరి వాటా 1400 రూపాయలు. ఇలా కేవలం 64 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న ఈ చిన్న నగరం పట్టణ ప్రాంతాల సమర్థవంతమైన నిర్వహణకు ఓ ప్రతీకగా నిలిచింది.

యాభై లక్షల జనాభాగల చెన్నై నగరం 2004–05లో రాబడి, మూలధన వ్యయాలతో కలుపుకుని పౌరవసతుల నిర్వహణకు ఖర్చుచేసిన మొత్తం 858 కోట్లు. అంటే తలసరి వార్షిక వ్యయం 1600 రూపాయలు. అలాగే కోటీ ఇరవై లక్షల జనాభా గల ముంబయి మహానగరం.. విద్యుత్ సరఫరా, రవాణాకు అయ్యే వ్యయంతో కలుపుకుని ఏటా 4000కోట్ల రూపాయలు వ్యయం చేస్తోంది. అదనపు వ్యయాన్ని వేరు చేసి చూసినా తలసరి వార్షిక వ్యయం రెండువేల రూపాయలు. అలాగే 45లక్షల జనాభా కలిగిన బెంగళూరు నగరం 2000 రూపాయల తలసరి చొప్పున 937 కోట్లు వ్యయం చేస్తోంది. దేశంలోని ఏ ప్రధాన నగరమైనా జంషెడ్‌పూర్‌ను మించి తలసరి వ్యయం చేస్తోంది. అయినప్పటికీ ప్రజలకు నాణ్యమైన సేవలు అందడం లేదు. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న నగరాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి, పౌరవసతులు సమకూర్చడానికి మరిన్ని నిధులు అవసరం. పన్నుల రూపేణా వసూలు చేసిన మొత్తాన్ని సరైన రీతిలో ఖర్చు చేసి, తగిన ప్రతిఫలం రాబట్టినప్పుడు మరింత ఎక్కువ మొత్తాలను చెల్లించేందుకు ప్రజలు వెనుకాడరు. సేవల నాణ్యతకు, పన్నుల చెల్లింపు పట్ల ప్రజల సుముఖతకు మధ్య అవినాభావ సంబంధం ఉందన్న విషయం ఇక్కడ గమనార్హం.

## స్థానిక అధికారాలతోనే అభివృద్ధి

ముంబయిలో వర్షబీభత్సం మనకు మేలుకొలుపు కావాలి. పట్టణ ప్రాంతాల పాలనా పద్ధతులలో సంస్కరణలు తెచ్చేందుకు అది దోహదపడాలి. మేయర్లను ప్రత్యక్షంగా ఎన్నుకునే వెసులుబాటు కల్పించడం ఆ దిశగా తీసుకునే మొదటి చర్య కావాలి. అలా ఎన్నికైన మేయర్‌కు, నగర కౌన్సిల్‌కు నగరాభివృద్ధికి సంబంధించి నిర్ణయాలు తీసుకునేలా పూర్తి అధికారాలు కల్పించాలి. ప్రతి నగరంలోనూ మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీలను ఏర్పాటు చేయడం– రెండవ చర్య. ఈ కమిటీలను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకునే వీలు కల్పించాలి. కమిటీకి ఛైర్‌పర్సన్‌గా మేయర్ వ్యవహరించాలి. తగిన అధికారాలు, బాధ్యలతో ఈ కమిటీలను పరిపుష్టం చేయాలి. రాజ్యాంగంలోని 243–జడ్ఇ అధికరణ మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీల ఏర్పాటు గురించి చెబుతున్నా, అవి అమలవుతున్న దాఖలాలు లేవు. ప్రతి డివిజన్‌లోనూ కార్పొరేటర్ ఛైర్మన్‌గా వార్డు కమిటీలను ఏర్పాటు చేయడం – మూడవ చర్య. రాజ్యాంగంలోని 243–ఎన్ అధికరణ వార్డు కమిటీల ఏర్పాటును నిర్దేశిస్తోంది. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధి నుంచి

ఈ కమిటీలకు సభ్యులను ఎన్నుకోవాలి. చెత్త తొలగింపు, వీధి దీపాలు, రోడ్లు, డ్రెయిన్ల నిర్వహణ, ఆరోగ్య కేంద్రాలపై అజమాయిషీ వంటి బాధ్యతల్ని వార్డు కమిటీలకు అప్పజెప్పాలి. వసూలయ్యే స్థానిక పన్నులలో కొంతభాగాన్ని వార్డు కమిటీలకు కేటాయించాలి. పేదరికం తాండవిస్తున్న ప్రాంతాల్లో వసూలైన స్థానిక పన్నులను పూర్తిగా ఆయా ప్రాంతాల అభివృద్ధికే వెచ్చించాలి. ధనిక ప్రాంతాలలో వసూలైన పన్నులలో కొంతభాగాన్ని కూడా పేదరికంతో అల్లాడుతున్న ప్రాంతాలకు కేటాయించాలి. ప్రభుత్వం వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తున్నా, అది మొక్కుబడి వ్యవహారంగా సాగుతోందే తప్ప దాని అసలు ఉద్దేశం నెరవేరటం లేదు. హైదరాబాద్ నగరంలో సగటున నాలుగు లక్షల జనాభాకు ఒకటి చొప్పున వార్డు కమిటీలు ఉన్నాయి. కానీ, ఈ కమిటీల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కడా కనబడదు. ఫలితంగా, రోడ్లు, డ్రైనేజీలు, చెత్త తొలగింపు వంటి కనీస పౌరసదుపాయాల కోసం ప్రజలకు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరగవలసి వస్తోంది. ప్రజల నుంచి ఈ రకమైన ఫిర్యాదులు పెరిగిపోతుండటంతో మునిసిపల్ కమిషనర్లు ఏం చేయాలో తెలియక చేతు లెత్తేస్తున్నారు. వసతులు సమకూరకపోవడంతో ప్రజలు పన్నులు చెల్లించకపోవడం, దానివల్ల వనరులు తరిగిపోవడం సహజంగా జరుగుతోంది. చివరకు ఇది ఒక సమస్యల సుడిగుండంలా తయారై పట్టణాలు, నగరాల అభివృద్ధిని హరించివేస్తోంది. ఈ విషవలయాన్ని మనం ఛేదించగలగాలి. చివరిగా– సంబంధిత అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తమ విధుల పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. ఇందులో భాగంగా స్వతంత్ర ప్రతిపత్తిగల అంబుడ్స్‌మన్‌ను నియమించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవా పట్టికలను ఏర్పాటు చేసి, సకాలంలో ప్రజలకు సేవలు అందించకపోతే సంబంధిత కార్యాలయాలు పౌరులకు పెనాల్టీ చెల్లించేవిధంగా నిబంధనలను రూపొందించాలి. సమాచార హక్కు ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే మన నగరాలు సకల సంపదలతో తులతూగుతాయి. నవీన నాగరికతకు పట్టుగొమ్మలై పరిఢవిల్లుతాయి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా 2005లో ఈనాడులో ప్రచురితమైన వ్యాసాల్లోని అంశాలివి) ◆


# మురికివాడలో పిల్లలకు సొంత లైబ్రరీతో చదువు అందిస్తున్న 9 ఏళ్ల థాట్ లీడర్

'ప్రపంచాన్ని మార్చటానికి విద్యను మించిన శక్తిమంతమైన ఆయుధం లేదు' అన్న నెల్సన్ మండేలా మాటలతో స్ఫూర్తిపొందిన మూడవ తరగతి విద్యార్థిని ముస్కాన్ అహిర్వార్ భోపాల్‌లో తాను ఉంటున్న మురికివాడలో చిన్న లైబ్రరీని ఏర్పాటు చేసింది. 121 సొంత పుస్తకాలతో దీన్ని ప్రారంభించింది. చుట్టుపక్కల పిల్లలకు కొంతైనా చదువుకోవటానికి ఈ లైబ్రరీ ఉపయోగపడుతుందని ముస్కాన్ నమ్మకం. తొమ్మిదేళ్ల ముస్కాన్ కృషిని గుర్తించి 'నీతి ఆయోగ్' ఇటీవల ఆమెకు 'థాట్ లీడర్' పురస్కారాన్ని అందించింది. 'విమెన్ క్యాంపయిన్ ఇండియా' పేరుతో 2016 అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మై గవ్, భారత్‌లోని ఐక్యరాజ్యసమితి సంస్థలతో కలిసి నీతి ఆయోగ్ ఈ థాట్ లీడర్స్ ఎంపిక ప్రారంభించింది. సమాజంలో మార్పు కోసం భిన్నంగా పనిచేసే మహిళలను గుర్తించటం కార్యక్రమం లక్ష్యం. నీతి ఆయోగ్ థాట్ లీడర్ అవార్డు అందుకున్న పిన్న వయస్కురాలు ముస్కానే. రియో ఒలింపిక్స్‌లో భారత్‌కు గౌరవాన్ని అందించిన రెజ్లర్ సాక్షి మాలిక్ చేతుల మీదుగా ఢిల్లీలో ముస్కాన్ ఈ అవార్డును అందుకుంది. ఇప్పుడు తన



లైబ్రరీలో అనేక పుస్తకాలు వచ్చి చేరాయని, తాజాగా అవార్డు రావటం తనకెంతో సంతోషాన్నిస్తోందని చెబుతోంది. భవిష్యత్తులో తాను డాక్టర్ కావాలనుకుంటున్నట్టు తెలిపింది. ప్రస్తుతం 50మంది పిల్లలు పుస్తకాలయాన్ని సందర్శిస్తున్నారని, మిగిలిన పిల్లల వద్దకు కూడా వెళ్లి పుస్తకాలు చదవటం, జీవితంలో ఏదోక గుర్తింపు పొందేలా ఎదగటం గురించి వివరించి లైబ్రరీకి వచ్చేలా చేస్తానని ముస్కాన్ అంటోంది.

# ఎన్నికల సంస్కరణలకు సమయం ఆసన్నం



ధనరాజకీయాల నుంచి ఎన్నికల వ్యవస్థను పరిరక్షించేందుకు, ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలను నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఎన్నికల సంస్కరణలపై చర్చకు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలేమిటి? డబ్బు పాత్ర ఏమేర ఉంది? ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకోవడం వంటి అన్ని అంశాలపైనా చర్చ జరగాలన్నారు. రకరకాల ఎన్నికలు వేర్వేరు సమయంలో జరుగుతున్నందువల్ల దేశంపై ఎన్నోరకాల భారం పడుతోందని చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై ఏదో ఒకటి చేయాల్సి ఉందంటూ రాజకీయ పార్టీలు సహా పలువురు తనతో చెబుతున్నారన్నారు. క్షీరసాగర మథనంతో అమృతాన్ని తీసిన రీతిలో.. బీజేపీ శ్రేణులు పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ శతజయంతి వేడుకల్లో ఎన్నికల సంస్కరణల అంశంపైనా మేధోమథనం జరపాలని ప్రధాని సూచించారు. 'స్థిర ఆలోచనలతో సంస్కరణలకు మార్గదర్శకత్వం వహించడం తగదు. కేవలం ప్రధానమంత్రి సూచనలే ప్రాతిపదికగా సంస్కరణలు చేపట్టడం క్షేమం కాదు. ఎన్నికల వ్యవస్థలో దేనిని ఉంచాలి, దేనిని తొలగించాలి అనేది తేలాల్సి ఉంది. సామాన్యుల హక్కుల్ని, ప్రజాస్వామ్య మూలాలను ఎలా బలోపేతం చేసుకోవచ్చో మనమంతా ఆలోచించాలి. అది మనం చేయగలిగితే దీర్ఘకాలంలో ఆరోగ్యవంత ప్రజాస్వామ్యాన్ని తీర్చిదిద్దుకోవడానికి తోడ్పాటు అందించినవారుగా నిలుస్తాం' అన్నారు.

**జమిలి ఎన్నికలపై ఇప్పటికే అభిప్రాయ సేకరణ**

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు జమిలిగా ఎన్నికలు జరిపే అంశంపై ప్రజలు అభిప్రాయలను తెలపాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు స్థితి అధ్యయన పత్రాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచింది. రాష్ట్రపతి, ప్రధానమంత్రితోపాటు పలు రాజకీయ పార్టీలు కూడా దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలకు అనుకూలంగా ఉన్నందున దీనిపై వివిధ రంగాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని ప్రభుత్వం భావించింది. ఐదు

**ఎన్నికల ప్రవర్తన నియమావళిని పదేపదే అమలు చేయాల్సిన పరిస్థితి కూడా తప్పుతుందని తెలిపింది. సంవత్సరం పొడవునా ఎన్నికలు జరుగుతుండటం వల్ల ప్రవర్తన నియమావళి అమలు కారణంగా సాధారణ ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభిస్తున్నాయని సెప్టెంబర్ 5న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన వ్యాఖ్యలనూ ప్రస్తావించింది. 'ఈ సూచనపై రాజకీయ నేతలు ఆలోచించాలి, రాజకీయ పార్టీలన్నీ సమష్టిగా ఆలోచిస్తే మార్పు తీసుకురాగలం,**

ప్రశ్నాంశాలున్న అధ్యయన పత్రాన్ని ప్రభుత్వ ఆన్‌లైన్ వేదిక 'మై గవ్'లో ఉంచి సూచనలను తీసుకుంది.

### పత్రంలో ప్రశ్నలు

ఒకేసారి ఎన్నికల నిర్వహణ వాంఛనీయమేనా, లాభనష్టాలేమిటి, ప్రతిపాదిత ఎన్నికల తేదీకి ముందుగానీ, తర్వాతగానీ కాలవ్యవధి ఉండే అసెంబ్లీల పరిస్థితి ఏమిటి? లోక్‌సభ, అసెంబ్లీల కాలవ్యవధిని స్థిరీకరించాలా, ఉప ఎన్నికలు వస్తే ఏం చేయాలి, అధికార పార్టీగానీ సంకీర్ణంగానీ మెజారిటీని కోల్పోతే పరిస్థితి ఏమిటి.. వంటి ప్రశ్నలను సంధించారు. ఈ తరహా ఎన్నికల నిర్వహణ వాంఛనీయమేనా అనే అంశం వివిధ స్థాయిలలో చర్చకు వచ్చిందని పత్రం తెలిపింది. వీటివల్ల ఓటర్లలో ఉత్సాహం కొనసాగడమే కాకుండా, ప్రభుత్వం, ఎన్నికల సంఘం యంత్రాంగంపై ఆర్థిక పాలనాపరమైన ఒత్తిడి తగ్గుతుందనే అభిప్రాయాలు వెల్లడయ్యాయని పేర్కొంది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పదేపదే అమలు చేయాల్సిన పరిస్థితి కూడా తప్పుతుందని తెలిపింది. సంవత్సరం పొడవునా ఎన్నికలు జరుగుతుండటం వల్ల ప్రవర్తన నియమావళి అమలు కారణంగా సాధారణ ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభిస్తున్నాయని సెప్టెంబర్ 5న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన వ్యాఖ్యలనూ ప్రస్తావించింది. 'ఈ సూచనపై రాజకీయ నేతలు ఆలోచించాలి, రాజకీయ పార్టీలన్నీ సమష్టిగా ఆలోచిస్తే మార్పు తీసుకురాగలం, ఎన్నికల్ని కలిపి నిర్వహించడంపై, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై ఎన్నికల సంఘం కూడా స్పందించాలి' అని రాష్ట్రపతి చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావించింది. ఈ అంశంపై మార్చిలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలోనూ ప్రధాని మోదీ లేవనెత్తారు. తర్వాత కొన్ని కార్యక్రమాల్లోనూ ప్రస్తావించారు. జాతీయస్థాయిలో చర్చకు పిలుపునిచ్చారు.

- జమిలి ఎన్నికల సంప్రదాయం 1967 వరకూ కొనసాగింది. రాజ్యాంగంలోని 356 అధికరణం ప్రకారం కొన్ని అసెంబ్లీలను రద్దు చేయటంతో గాడి తప్పింది.
- 1998లో న్యాయకమిషన్ ఎన్నికల చట్టాల సంస్కరణపై తన 107వ నివేదికలో.. లోక్‌సభ, అన్ని శాసనసభలకు ఐదేళ్లకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించే నిబంధన చేయాలని సూచించింది
- సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, న్యాయం అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం గత ఏడాది డిసెంబర్ 17న తన 79వ నివేదికలో.. జమిలి ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం తీసుకుంటే పలు నిర్మాణాత్మక మార్పులు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందని పేర్కొంది. రాజ్యాంగంలోని 83, 172, 85, 174 అధికరణలకు సవరణలు చేయాల్సి ఉంటుందని తెలిపింది.
- లోక్‌సభకు తదుపరి సాధారణ ఎన్నికలు 2019లో జరగాల్సి ఉంది. 5 రాష్ట్రాల శాసనసభలకు 2017లో, 13 రాష్ట్రాలకు 2018లో, 9 రాష్ట్రాలకు 2019లో, ఒక అసెంబ్లీకి 2020లో, మిగతావాటికి 2021లో ఎన్నికలు జరగాల్సి ఉంది.


ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, కేంద్రంలో నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానాలనే అనుమతించటం, దామాషా ఎన్నికల పద్ధతి సంస్కరణల్ని కూడా జోడిస్తేనే ఒకేసారి ఎన్నికల ప్రయత్నానికి సార్థకత అని ఎన్నికల సంస్కరణల కోసం సుదీర్ఘ బహుముఖ కృషి చేస్తున్న లోక్‌సత్తా ఇప్పటికే తన అభిప్రాయాన్ని స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. ◆

## ప్రజలు కాదన్నా.. శాంతి యత్నానికే నోబెల్ అవార్డు

కొలంబియాలో సుమారు ఆరు దశాబ్దాల సాయుధ అంతర్యుద్ధానికి తెరదించేందుకు కృషి చేసిన దేశాధ్యక్షుడు జువాన్ శాంటోజ్‌కు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఈ శాంతి ఒప్పందంపై రెఫరెండమ్‌లో ప్రజలు తక్కువ సంఖ్యలో పాల్గొని మెజారిటీ ఓటర్లు తిరస్కరించి కామా పెట్టినా.. నోబెల్ కమిటీ శాంటోజ్ వైపే మొగ్గు చూపటం విశేషం.

# పటిష్ట చట్టంతోనే ప్రజలకు సమాచార హక్కు

- డా॥ జయప్రకాష్ నారాయణ్




మనదేశం లో మంత్రులు పదవీ స్వీకారం చేయగానే మొట్ట మొదట చేసే ప్రతిజ్ఞ– 'తన నెన్నుకుని బాధ్యతల్ని అప్పగించిన ప్రజలకు తెలియ కుండా అధికార రహస్యాలను దాచి పెడతానని'. రాజ్యాంగ నిర్మాతలు దీన్ని ఏకంగా రాజ్యాంగం లోని మూడో షెడ్యూలులో చేర్చారు. మంత్రు లందరూ విధిగా ఈ ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరాన్ని కల్పించారు. దీనివల్ల ఏం నష్టం జరిగింద నేది అంత ముఖ్యం కాదు. వాస్తవానికి వలస పాలకులు చేసిన 'అధికార రహస్యాల చట్టాన్న'ను సరించి కొన్ని అంశాలు మాత్రమే దాచిపెట్టాలి. కానీ పదవీస్వీకారాన్ని రహస్య ప్రతిజ్ఞతో జోడించటం ఒకరకంగా మన వ్యవస్థలో జవాబుదారీతనం కొరవడటానికి దారితీస్తోంది. ఒకసారి ఎన్నికలయ్యాక ఇక ప్రజలకు మళ్లీ అయిదేళ్లదాకా ఏ పాత్రాలేదని, నోరు మూసుకుని అన్ని అవమానాలను దిగమింగుకుంటూ, అన్యాయాలను సహిస్తూ కూర్చో వలసిందేనని ఈ రహస్య శపథం మనకు గుర్తుచేస్తోంది. 'పాత్రికేయుడుగానీ, పౌరుడుగానీ ఏ చిన్న పాలన విషయాన్ని గూర్చి సమాచారం తెలుసుకోవాలన్నా అధికారులు ప్రదర్శించే బెట్టు, దాపరికం అంతా ఇంతా కాదు. మన డబ్బుతో మన మీద పెత్తనం చేస్తూ– అసలు జనం కలిగించే ఇబ్బందులు లేకపోతే తమ పని ఏ చీకూ చింతా లేకుండా హాయిగా జరిగిపోతుందని' మన పేరుతో మన సేవకులుగా కూర్చున్నవాళ్ల భావన. అందుకే ఎక్కడ ఏ ఉద్యోగిని నిలదీసినా మనకి తరచు ఎదురయ్యే ప్రశ్న "ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని.

### రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ

రాజ్యాంగంలో 19(1)(ఎ) అధికరణలో పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యాన్ని, భావస్వాతంత్ర్యాన్ని అందించారు. అలాగే 21వ అధికరణలో జీవించే హక్కు వ్యక్తి స్వేచ్ఛను పొందుపరిచారు. 19(2) అధికరణ ప్రకారం ఈ స్వేచ్ఛకు కొన్ని హేతుబద్ధమైన పరిమితులను మాత్రమే చట్టం ద్వారా విధించవచ్చు. ఉదాహరణకు దేశ భద్రత కోసం, వివిధ దేశాలతో సత్సంబంధాల కోసం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం, సమాజంలో నీతిని, మర్యాదను కాపాడటం కోసం, కోర్టుల గౌరవాన్ని కాపాడటం కోసం, నేరాన్ని ప్రేరేపించకుండా నిరోధించడం కోసం మాత్రమే వ్యక్తి స్వేచ్ఛను కొంతమేరకు అదుపుచేయవచ్చు. అంతకుమించి ఏ చట్టసభకు, ప్రభుత్వానికి వాక్ స్వాతంత్ర్యాన్ని, సమాచార హక్కుని నిరోధించే హక్కు లేదు. అలా చేస్తే అది రాజ్యాంగ విరుద్ధం. సుప్రీంకోర్టు వివిధ కేసులలో తీర్పులనిస్తూ పాలనా సమాచార హక్కుని రాజ్యాంగబద్ధమైనదిగా గుర్తించింది. 1973లో బెన్నెట్ కోల్‌మన్ కేసులోను, 1975లో రాజ్‌నారాయణ్ కేసులోను, 1980లో ఎస్.పి గుప్తా కేసులోను, 1989లో మనుభాయ్ షా వర్సెస్ ఎల్.ఐ.సి కేసులోను సర్వోన్నత న్యాయస్థానం నిర్ద్వంద్వంగా ప్రజలకు పాలనా సమాచార హక్కు రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులలో భాగమని ప్రకటించింది. అయినా ఇన్నాళ్లకు కూడా దేశంలో ఈ హక్కుకు సరైన రూపం కల్పిస్తూ ప్రజలకు

పనికివచ్చే చట్టాన్ని చేయలేకపోయారు. ఎన్నో నిపుణుల కమిటీలు నమూనా చట్టాలను రూపొందించాయి. శౌరి కమిటీ ప్రతిపాదించిన బిల్లు, ప్రెస్ కౌన్సిల్ బిల్లు, ఎన్.ఐ.ఆర్.డిలో జస్టిస్ సావంత్, జార్జి ఫెర్నాండెజ్, కన్నభిరాన్, నిఖిల్ దే, ఈ వ్యాస రచయిత తయారుచేసిన నమూనా చట్టం– ఇలా ఎన్నో రకాల నమూనాలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పటికి కూడా దేశవ్యాప్తంగా అమలయ్యే చట్టం మాత్రం మన నేతలకు సాధ్యం కాలేదు. ప్రతి పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో 'సమాచార హక్కు'ను గూర్చి ప్రస్తావించింది. కానీ మాటలకు, చేతలకు పొంతనలేకపోవడం మనందరికీ అలవాటైన పంథాయే. ప్రపంచంలో పరిణతి చెందిన ప్రతి ప్రజాస్వామ్య దేశంలోను సమాచార హక్కు చట్టాలున్నాయి. ఉదాహరణకు స్వీడన్‌లో 1810 నుంచి ఇలాంటి హక్కు అమలవుతోంది. అమెరికా 1966లో ఇలాంటి చట్టాన్ని చేసి పకడ్బందీగా అమలుపరుస్తోంది. ఆ దేశంలో అందుకే అధికారంలో ఉన్న వాళ్లకు పత్రికలన్నా, సమాచారాన్ని కూపీలాగి బయటపెట్టే స్వచ్ఛంద సంస్థలన్నా హడలు. నార్వే, ఫిన్లండ్‌లలో 1970లో, ఫ్రాన్సులో 1978లో, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో 1982లో, కెనడాలో 1983లో, గ్రీసులో 1986లో, దక్షిణాఫ్రికాలో 1997లో, ఐర్లాండ్‌లో 1998లో, బ్రిటన్‌లో 2001లో ఇలాంటి చట్టాన్ని చేశారు. అన్ని ప్రజాస్వామ్య దేశాలలోను పాలనా సమాచార హక్కులో భాగంగా రెండు అంశాలు అమలులో ఉన్నాయి. అడగకుండా ప్రభుత్వాలు అన్ని ముఖ్య నిర్ణయాలకు సంబంధించి సమాచారాన్ని తెలపాలి. అదికాక అడిగినప్పుడు ఇతర అంశాలకు సంబంధించి నిర్దిష్ట సమాచారాన్నివ్వాలి.

గత సంవత్సరం జులైలో భారత ప్రభుత్వం పార్లమెంటులో ఓ సమాచార హక్కు బిల్లును ప్రవేశపెట్టింది. అందులో చాలా లోపాలున్నాయి. ఏ అంశానికయినా సమాచారం ఇవ్వాలంటే 30 పనిరోజుల గడువు పెట్టారు. ఓ వ్యక్తి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు, ఓ పౌరుడి స్వేచ్ఛకే ప్రతిబంధకం కలిగినప్పుడు గంటలోగా సమాచారం అందకపోతే, నెలరోజులపాటు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే అది ప్రమాదాలకు దారితీస్తుంది. అలాగే ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉండే సాధారణ సమాచారానికి కూడా 30రోజుల గడువునివ్వటం అసంబద్ధం. ఇంత గడువు దాటాక కూడా బుద్ధిపూర్వకంగా సమాచారం అందించకపోయినా లేక తప్పుడు సమాచారాన్నిచ్చినా, ఆ అధికారులకు ఏ శిక్షా లేదు! తప్పు చేస్తే శిక్షకు అవకాశం కల్పించని చట్టం వ్యర్థం. అది కోరలు పీకిన పాములాంటిది! అలాంటప్పుడు ఇక చట్టం ఎందుకో అర్థం కాదు. మనుషుల మనస్తత్వాలను మార్చాలని, చట్టంలో శిక్షలుండటం వల్ల ప్రయోజనం లేదని కొందరు వాదిస్తున్నారు. ఇంతకన్నా అసంబద్ధమైన వాదన మరొకటి లేదు. తప్పు చేస్తే శిక్ష ఉంటుందన్న భయం, మంచి చేస్తే గుర్తింపు, గౌరవం ఉంటాయన్న నమ్మకం సమాజంలో నీతికి, సత్ప్రవర్తనకు ఆధారాలు. అసలు శిక్షలే అక్కరలేదని, మనుషులను సన్మార్గులను చేద్దామని ప్రయత్నిస్తే, అది మత గురువులు, మహాత్ములు చేయవలసిన పని. చట్టం పని మంచిని ప్రోత్సహించటం, చెడుని నిరోధించటం. కాబట్టి చట్టాన్ని బుద్ధిపూర్వకంగా ఉల్లంఘించిన వాళ్లకు ప్రజల హక్కులను కాలరాసేవారికి శిక్ష విధిగా ఉండాలి. ఇక సమాచారం అందించకపోతే పౌరుడి ఫిర్యాదులను అందుకునే స్వతంత్ర సంస్థల ఏర్పాటు ఈ బిల్లులో లేదు. కేవలం ప్రభుత్వం లోపల మాత్రమే రెండు అప్పీళ్లకు ఏర్పాటు ఉంది. అంటే ఆ ప్రభుత్వంలో వాళ్లు తాము చేసిన దుశ్చర్యలు, అవినీతి బయటపడతాయని భయపడి వాస్తవాలను దాచిపెడితే, ఇక దానికి పరిష్కారం ఉండదు. పౌరుడు గుడ్లప్పగించి మౌనంగా చేతులు ముడుచుకుని కూర్చోవలసిందే! అలాగే భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో సమాచారాన్ని అందించటానికి మినహాయింపులు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఏదో ఒక వంకన సమాచారం అందించకుండా అధికారులు తప్పించుకునే అవకాశాన్ని ఈ మినహాయింపులు కల్పిస్తున్నాయి. అదీకాక సమాచార హక్కు ఆచరణ రూపం దాల్చాలంటే ప్రభుత్వంలో జరిగే అవకతవకలను ప్రజాప్రయోజనాల కోసం బయటపెట్టేవారిని ప్రోత్సహించాలి. అలాంటి సమాచారాన్ని వెల్లడి చేసే అధికారులకు చట్టం ద్వారా రక్షణ కల్పించాలి. పార్లమెంటు ముందున్న బిల్లులో ఆ ఏర్పాటు లేదు. ఈ లోపాలన్నీ తొలగించాలని లోక్‌సత్తా, రాజస్తాన్‌లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనీషియేటివ్, అహ్మదాబాద్‌లోని కన్స్యూమర్ ఎడ్యుకేషన్ రీసెర్చి సెంటర్– వగైరా సంస్థలు, ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మన ప్రభుత్వాలకు నోళ్లున్నాయిగానీ చెవులు లేవు, కళ్లున్నాయి గానీ చూడలేరు. అందువల్ల ఆ బిల్లు ప్రస్తుతానికి యథాతథంగా పార్లమెంటు కమిటీ ఆమోదం పొందినట్లు వార్తలచ్చాయి. అయితే జాతీయస్థాయిలో చట్టం కోసం వేచిచూడకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, రాజస్తాన్‌లలో సమాచార హక్కు చట్టాలను ఆమోదించారు. మధ్యప్రదేశ్‌లో అలాంటి బిల్లు శాసనసభ ఆమోదం పొంది రాష్ట్రపతి అనుమతి కోసం పంపి నాలుగేళ్లయినా అక్కడ అతీగతీ

లేదు! అయినా మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆ చట్టాన్ని నిబంధనల రూపంలో అమలుచేస్తోంది. ఈ చట్టాలన్నిటిలో గోవా, కర్ణాటక రాష్ట్రాల చట్టాలు మంచివి.

**మన రాష్ట్రం చొరవ చూపాలి**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల అనుభవాలను, ప్రపంచదేశాల చట్టాలను పరిగణలోకి తీసుకున్న లోక్‌సత్తా మన రాష్ట్రానికి ఓ నమూనా చట్టాన్ని తయారుచేసి ప్రభుత్వానికి, ప్రధాన పార్టీల నాయకులకు పంపింది. అయితే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. ఎప్పుడూ పారదర్శకతను గూర్చి మాట్లాడే ప్రభుత్వాధినేతలు మౌనముద్ర దాల్చారు! లోక్‌సత్తా నుంచి, పౌరసమాజం నుంచి వస్తున్న ఒత్తిడి వల్ల చట్టాన్ని త్వరలో తెస్తామని ప్రభుత్వం పరోక్షంగా హామీ ఇస్తోంది. ఏదో ఒక చట్టం కొద్దికాలంలో రావచ్చు. అయితే మనం పోరాడవలసింది కంటితుడుపు చట్టం కోసం కాదు. సరయిన సమాచార హక్కు చట్టంలో కొన్ని కనీస ప్రమాణాలుండాలి. అతి తక్కువ కాలవ్యవధిలో సమాచారాన్నందించటం, వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన అంశాలలో వెంటనే సమాచారాన్నివ్వటం, బుద్ధిపూర్వకంగా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు వేయటం, స్వతంత్ర ప్రతిపత్తి గల అధికారులకు అప్పీలు చేసే వీలు కల్పించటం, సమాచార వెల్లడికి అతి తక్కువగా, స్పష్టమయిన మినహాయింపులు ఉండటం, ప్రజా ప్రయోజనాల రీత్యా సమాచారాన్ని వెల్లడిచేస్తే అధికారులకు రక్షణ కల్పించటం-ఇవన్నీ సమాచార చట్టంలో ఉండాలి. అన్నింటికీ మించి మరో సదుపాయం కల్పించాలి. శాసనసభ నుంచి సమాచారాన్ని దాచే సాహసాన్ని ప్రభుత్వాలు చేయవు. శాసనసభ్యులు తమ అధికారాలు, హక్కుల కోసం నిరంతరం పోరాడుతుంటారు. కాబట్టి శాసనసభకు అందించే సమాచారం అంతా ప్రజలకు కూడా వెల్లడయ్యేలా చట్టంలో నిర్దిష్ట ఏర్పాట్లు ఉంటే పౌరులకు సమాచార హక్కు నిరంతరం విస్తృతమవుతూ ఉంటుంది. ఇప్పుడు రాజకీయ పార్టీలు, పౌర సమాజం, పత్రికలు, ప్రచార సాధనాలు రెండు అంశాల మీద దృష్టి సారించాలి. మొదటిది, కంటితుడుపు చట్టం కాక నిజంగా ప్రజలకు పనికివచ్చేది, పాలకులను జవాబుదారీగా చేసేది అయిన చట్టం వచ్చేలా పోరాడాలి. రెండోది, ఆ చట్టం సరిగ్గా అమలయ్యేలా, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకునేలా పౌరుల్ని తయారుచేయాలి. ఇల్లలకగానే పండగ కాదు. ఎన్నో చట్టాలు కాగితం మీద ఉన్నా, వాటి ప్రయోజనం శూన్యం. ప్రజలకు ఆ చట్టాలను వినియోగించుకోవటం తెలిసినప్పుడే చట్టాల వల్ల స్వేచ్ఛ వికసించి ప్రజాస్వామ్యం పునీతమవుతుంది. పాలనా సమాచార హక్కు కేవలం ఒక చిన్న సంస్కరణ కాదు. దాన్ని సాధిస్తే ప్రభుత్వ నిర్వహణ మొత్తం ప్రజలకు వెల్లడవుతుంది. మనం కట్టే పన్ను డబ్బుతో ప్రభుత్వం చేసే ఖర్చు, ఉద్యోగుల పనితీరు, చట్టాల అమలు, ప్రభుత్వాల నిర్ణయాలు- అన్నీ మనకు తెలిసే అవకాశం ఉంటుంది. పౌరులు ప్రభువులు కావాలంటే మంచి చట్టం వచ్చేలా, ఆ చట్టం సరిగ్గా అమలయ్యేలా పౌరసమాజం పోరాడాలి. అప్పటిదాకా పారదర్శకత కేవలం నేతల ప్రసంగాలలోనే కనిపిస్తుంది.

(జేపీ 'భవిష్యత్ భారతం'లో భాగంగా సెప్టెంబర్ 3, 2000న ఈనాడులో ప్రచురితమైన ఈ వ్యాసం.. సమాచార హక్కు చట్టం వార్షికోత్సవం సందర్భంగా) ◆

# రోడ్ల నిర్వహణ స్థానిక ప్రజలకు అప్పచెప్పండి: లోక్‌సత్తా

గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లు వర్షాకాలం పూర్తయ్యేంత వరకూ బాగుచేయలేమనటం సిగ్గుచేటని, అధికారంలో సగం కాలాన్ని పూర్తి చేసుకున్నా తెరాస ప్రభుత్వం ఇంకా ప్రజల ప్రాథమిక అవసరాలను పరిష్కరించే పాలనను అందించలేకపోతోందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. రోడ్ల మరమ్మతుల పేరుతో దోపిడీ జరుగుతోందని, నాణ్యతాప్రమాణాలలో అధికారులను, కాంట్రాక్టర్లను బాధ్యుల్ని చేయాలన్నారు. వార్డులకు నిధులు, అధికారాలను ఇచ్చి రోడ్లు,



డ్రైనేజీలు, పారిశుధ్యం వంటి రోజూవారీ పనుల నిర్వహణను స్థానిక ప్రజల కమిటీలకు అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర, జీహెచ్ఎంసీ ఉపాధ్యక్షులు దుర్గారావు, గంగాభవానీతో కలిసి ఆయన ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీల పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఖైరతాబాద్, రహ్మత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు రంజిత్, లక్ష్మీనారాయణ, కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ, కార్యకర్తలు పాల్గొన్నారు. ◆

# లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం ఏర్పాటు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భీశెట్టి బాబ్జీ, కల్లూరి బాలసుబ్రమణ్యం



లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటైంది. వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యఅతిథిగా హాజరైన సమావేశంలో గౌరవ సలహాదారులు డా॥ కామినేని పట్టాభిరామయ్య, ఎం. జానకిరామరాజు కమిటీ ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించారు. నూతన అధ్యక్షుడిగా భీశెట్టి బాబ్జీ, ప్రధాన కార్యదర్శిగా కల్లూరి బాలసుబ్రమణ్యం ఎంపికయ్యారు. కోశాధికారిగా చందూ శ్రీనివాస్ నియమితులయ్యారు.

పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా వి.అశోక్ (అనంతపురం), ఎం.రాజ్‌వర్మ (తూర్పుగోదావరి), ఎంఎస్ఎన్ మూర్తి (విశాఖపట్నం), బి.అశోక్‌కుమార్ (విజయవాడ), ఎ.దామోదర్ (విజయనగరం), పి.రాంబాబు (శ్రీకాకుళం), ఎన్.నాగేంద్ర బాబు (విజయవాడ), కె.శ్రీనివాస్ (హైదరాబాద్), ఎం.భానుప్రసాద్ (గుంటూరు), చంద్రశేఖర్ (ఒంగోలు) ఎంపికయ్యారు. అక్టోబర్ 2, 2017న సమీక్షించి పార్టీ సంస్థాగత ఎన్నికలను నిర్వహించే వరకూ ఈ తాత్కాలిక కార్యవర్గం కొనసాగుతుంది. ◆

# రాష్ట్ర సమస్యల పరిష్కారంపై పాలకులకు, పార్టీలకు ఆసక్తి లేదు విద్యలో అధ్వాన్నంగా ఆంధ్రప్రదేశ్: జేపీ

రాష్ట్ర విభజన జరిగితే హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేక హోదా ఏర్పాటుతో ఆర్థిక దన్నునివ్వాలని మొట్టమొదట ప్రతిపాదించింది లోక్‌సత్తాయేనని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విజయవాడలో పార్టీ సమావేశంలో పాల్గొన్న అనంతరం మీడియాతో జేపీ మాట్లాడుతూ..ఓట్లు, సీట్లు పొందిన పార్టీలు విభజన సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు హైదరాబాద్ మిగులు ఆదాయాన్ని 23 జిల్లాలు పంచుకునేవని, విభజన తర్వాత ఆ ఆదాయం ఏపీలోని జిల్లాలకు రావటం లేదని అన్నారు. ఆ నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. పాలకుల పొరపాట్లు, దూరదృష్టి లేకపోవటం వల్ల విద్య, ఆరోగ్య సంస్థలు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు అన్నీ హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకృతమయ్యాయన్నారు. తీరప్రాంతాన్ని, ఖనిజవనరులున్న రాయలసీమను నిర్లక్ష్యం చేయటంతో యువతకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. యువత ఉపాధికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రానికి కస్టమ్స్ డ్యూటీలో కేంద్రం మినహాయింపునిచ్చి పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయటంతోపాటు దుగ్గరాజపట్నం, కాకినాడ-కృష్ణపట్నం మధ్య పోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. రామాయపట్నం పోర్టుకు అనుకూలమని నిపుణులు తేల్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆర్భాటాలు, ఆడంబరాలు, పుష్కరాలు వంటి కార్యక్రమాలతో వృథా ఖర్చు తప్ప ప్రజలకు ఉపయోగపడే విద్య, ఆరోగ్య రంగాలపై శ్రద్ధ లేదన్నారు. పత్రికల్లో తమకు తప్ప వేరెవరికీ హెడ్‌లైన్స్ ఉండకూడదన్నట్టు పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. పుష్కరాలకు ఆరోగ్య పరిరక్షణ, భద్రతా ఏర్పాట్లు ప్రభుత్వానికేమీ సంబంధం ఉండదన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలోని ప్రతి విద్యార్థి మీద ఏటా రూ.42,000 ఖర్చు చేస్తున్నా విద్యాప్రమాణాలు లేవన్నారు. ఉపాధ్యాయుల ప్రమాణాలపై పరీక్షను రద్దుచేయించిన ఘనత ఏపీ ప్రభుత్వానిదన్నారు. కేంద్రం ఇచ్చిన ముద్రా బ్యాంకు రుణాల అవకాశాన్ని ఏపీ వినియోగించుకోలేకపోయిందని, దేశంలో 4.63 కోట్లమంది లాభం పొందితే రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల కేవలం 8 లక్షలమందికే రుణాలు వచ్చాయన్నారు. కేంద్రం నుంచి ట్యాక్స్ హాలిడేతో పరిశ్రమలను సాధించే ప్రయత్నం చేయాలని జేపీ డిమాండ్ చేశారు. ◆

# ఆకాంక్షలు చాలవు, ప్రతి ఒక్కరూ పరిష్కారంలో భాగమయ్యే వ్యవస్థలు కావాలి: ఐఐటీ ఫర్ విలేజెస్‌లో జేపీ



తాత్కాలిక చిట్కాలతో ప్రజల ఆకాంక్షలు నెరవేరవని, ఆకాంక్షల జాబితాలు వల్లించే స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పరిష్కారంలో భాగమయ్యేలా వ్యవస్థల నిర్మాణం కోసం కృషి చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. చిట్టచివరి వ్యక్తి కూడా తన ప్రయోజనాలేమిటో గుర్తించి వాటిని సాధించుకునేందుకు ప్రభుత్వ విభాగాలను, సమాజ వనరులను వినియోగించు కోగలిగేలా వ్యవస్థల నిర్మాణం ఉండాలన్నారు. తమ ఓటుకు–తమ ప్రయోజనాలకు సంబంధం అర్థమైతే ప్రజలు కులం, మతం, ప్రాంతం, భాష, డబ్బు వంటి భావోద్రేకాలకు, ప్రలోభాలకు అతీతంగా వ్యవహరించగలరని, ప్రజల అవగాహనే ప్రజాస్వామ్యానికి అత్యుత్తమ గ్యారంటీ అన్నారు.

ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లో 'ఐఐటీ ఫర్ విలేజెస్' విద్యార్థులు నిర్వహిస్తున్న ఇగ్నైటింగ్ మైండ్స్ కార్యక్రమంలో జేపీ పాల్గన్నారు. రాజకీయాలు, చట్టబద్ధపాలన, పరిపాలన, విద్య, ఆరోగ్యం, తదితర అంశాలపై ఫేస్ టు ఫేస్ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా అడిగిన ప్రశ్నలకు జవాబు లిస్తూ చర్చించారు. గ్రామీణ ప్రజలకు సాధికారత కల్పించే విధానాలలో పాఠశాల విద్యార్థులను భాగస్వాముల్ని చేసేందుకు, ముమ్మందు రాజకీయాలు, పాలనను కెరీర్‌గా చేపట్టి విధాన కర్తలుగా ఎదిగేలా వారిలో చైతన్యం కలిగించేందుకు ఐఐటీ మద్రాస్ విద్యార్థులు ఐఐటీ ఫర్ విలేజెస్ బృందాన్ని 2008లో ప్రారంభించారు. ◆



# అన్నీ ఉన్నా ఆరోగ్యం అందించని రాజకీయమే దేశానికి శాపం







సాంకేతిక పరిజ్ఞానాన్ని ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థకు అనుసంధానించిన ఒక ప్రైవేటు హెల్త్ సర్వీస్ ఏజెన్సీ భారత్‌లో నామమాత్రపు పెట్టుబడుతో వేల కోట్ల మేర మదుపరులను ఆకర్షిస్తోందంటే, అది కేవలం అందరికీ ఆరోగ్యాన్ని అందించాల్సిన ప్రభుత్వాల ఘోరవైఫల్యం వల్లే. ఆరోగ్యరంగాన్ని ప్లేటులో పెట్టి ప్రైవేటు రంగానికి అందిస్తుండటం వల్ల ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతూ పేదరికంలోకి కుంగుతున్నారు. మనదేశంలో పేదరికానికి అనారోగ్యం ఓ ప్రధాన కారణంగా ఉంది. ప్రైవేటు రంగం విస్మరించలేని స్థాయికి చేరుకుంది కాబట్టి ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో గ్రామస్థాయి నుంచీ ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో దేశ బడ్జెట్ పరిధిలోనే జాతీయ ఆదాయంలో కేవలం 2శాతంతో అందరికీ ఖర్చులేకుండా ఆరోగ్యాన్ని అందించే నమూనాను లోక్‌సత్తా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అందించినా ఇంకా పాలకులు తాత్సారం చేస్తున్నారు. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం తన ప్రాథమిక బాధ్యతల్లో ముఖ్యమైనవి అని ఇంకా పాలకులు అనుకోవటం లేదు, మన సమాజం కూడా భావించటం లేదు.. 2017 ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవ సంవత్సరం కాగలదని వైద్యసేవల అంకుర కంపెనీలు అంచనా వేస్తున్నాయి. వేగవంతమైన 4 జీ సేవలు, నైపుణ్యం గల వైద్యసేవలకు తోడవటం వల్ల భారత్‌లో గ్రామీణ స్థాయి వరకూ వైద్యసేవల్ని విస్తరించేందుకు గొప్ప అవకాశాలు ఎదురుచూస్తున్నాయని

**మనదేశంలో పేదరికానికి అనారోగ్యం ఓ ప్రధాన కారణంగా ఉంది. ప్రైవేటు రంగం విస్మరించలేని స్థాయికి చేరుకుంది కాబట్టి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో గ్రామస్థాయి నుంచీ ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో దేశ బడ్జెట్ పరిధిలోనే జాతీయ ఆదాయంలో కేవలం 2శాతంతో అందరికీ ఖర్చులేకుండా ఆరోగ్యాన్ని అందించే నమూనాను లోక్‌సత్తా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అందించినా ఇంకా పాలకులు తాత్సారం చేస్తున్నారు.**

అంటున్నాయి. ఇదే నేపథ్యంలో ప్రజారోగ్య సంక్షోభంపై భారత పాలకుల్ని మరోమారు హెచ్చరించే నివేదికను ఐక్యరాజ్యసమితి విడుదల చేసింది.

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం ఆరోగ్యం విషయంలో మనం ఘనా, కోమరస్ వంటి దేశాల కంటే కూడా వెనకబడి ఉన్నాం. ఆరోగ్య రంగంలో ప్రపంచంలోని 188 దేశాల్లో మన దేశానికి 143వ స్థానం లభించింది. పాకిస్తాన్ (149వ స్థానం), బంగ్లాదేశ్ (151) కంటే మాత్రమే మనం కొంత మెరుగైన స్థితిలో ఉన్నాం.

1990–2015 మధ్య కాలంలో వివిధ దేశాల్లో చోటుచేసుకున్న శిశు మరణాలు, మలేరియా, పారిశుద్ధ్యం, వాయు కాలుష్యం వంటి విషయాల ఆధారంగా ఆయా దేశాల స్థానాలను నిర్ణయించారు. ఆహారం, సురక్షిత తాగు నీరు,

పేదరికం, వాతావరణ మార్పులు వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) చేరుకున్న తీరును మదింపు చేస్తూ తొలి వార్షిక నివేదికను రూపొందించారు.

ఆరోగ్యపరమైన ఎస్‌డీజీ సూచీలో ఐస్‌లాండ్, సింగపూర్, స్వీడన్ తొలి మూడు స్థానాలలో నిలిచాయి. విశేషమేమంటే, యూకే నాలుగో స్థానంలో నిలవగా, ఫిన్లాండ్ ఐదో స్థానంలో ఉంది. లోక్‌సత్తా ప్రతిపాదించిన అందరికీ ఆరోగ్యం స్కీముకు స్ఫూర్తినిచ్చిన జాతీయ ఆరోగ్య పథకం యూకేలో అమలులో వున్న విషయం తెలిసిందే. సోమాలియా, దక్షిణ సూడాన్‌లు అట్టడుగున ఉన్నాయి. నవజాత శిశువులు, అయిదేళ్ల లోపు పిల్లల మరణాలను తగ్గించటం, కుటుంబ నియంత్రణ, సార్వత్రిక ఆరోగ్య రక్షణ వంటి రంగాల్లో 2000 సంవత్సరం నుంచి చూస్తే ప్రపంచవ్యాప్తంగా పురోగతి కనిపించింది. క్షయ వ్యాధి నిర్మూలన విషయంలో మనదేశం 10 పాయింట్లు మాత్రమే దక్కించుకుంది.

రూ. 19.38లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో ఈ ఏడాది ఆరోగ్యానికి కేటాయించింది రూ. 38,206కోట్లు మాత్రమే. దేశం మొత్తం మీద 130 కోట్ల జనాభాకి 5.76లక్షల పడకల సామర్థ్యంతో 12,760 ప్రభుత్వ వైద్యశాలలే అందుబాటులో ఉన్నాయి. ఉచితంగా మందులు, వైద్యసేవల గురించి ఉపన్యాసాలు తప్ప పెద్దగా చర్యలు కనిపించటం లేదు. ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుద్ధానికి 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని ప్రారంభించినా.. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు లేకపోవటంతో ఆ పథకం ప్రచారంలో సాధించినన్ని ఫలితాల్ని లక్ష్యసాధనలో సాధించలేకపోతోంది. ముఖ్యంగా ఆరోగ్య సేవలు పెద్దగా అందని గ్రామీణ స్థాయిలో స్వచ్ఛభారత్ ప్రభావం నామమాత్రంగా ఉంది. అన్ని అవకాశాలున్నా తాత్సారం చేస్తున్న పాలకుల్ని కదిలించేలా ప్రజలు, పౌరసమాజం మేలుకొంటేనే అందరికీ ఆరోగ్యం కల సాకారమవుతుంది.

దేశ ఆదాయంలో రెండు శాతం ఖర్చుతోనే ప్రజల జేబుల్లో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఎలా 'అందరికీ ఆరోగ్యం' అందించవచ్చో లోక్‌సత్తా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ప్రజలందరూ గొంతు కలపటమే ఆలస్యం. ◆

## 'స్వరాజ్ ఇండియా' పార్టీ ఆవిర్భావం

ఆమ్ ఆద్మీ బహిష్కృత నేతలు యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్ 'స్వరాజ్ ఇండియా' పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించారు. ప్రతి ఎన్నికలో పోటీచేయబోమని, త్వరలో జరగనున్న ఢిల్లీ స్థానిక ఎన్నికల్లో పాల్గొంటామని చెప్పారు. తాము ఇప్పటికే ప్రారంభించిన రాజకీయేతర 'స్వరాజ్ అభియాన్' అలాగే కొనసాగుతుందని, ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావటం ఇష్టంలేనివారు అందులో పనిచేస్తారని తెలిపారు.

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో గాంధీ జయంతి, లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావ దినోత్సవం





అక్టోబర్ 2న గాంధీ జన్మదినోత్సవం, లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పార్టీ నేతలు నిర్వహించారు. హైదరాబాద్‌లో పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు జాతీయ జెండా, పార్టీ జెండా ఎగురవేయగా, విజయనగరంలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నేత భీశెట్టి బాబ్జీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి వేడుకలు నిర్వహించారు.

# లోక్‌సత్తాకు స్ఫూర్తినిచ్చిన గురజాడ భావాలు





దేశమంటే మట్టికాదు, మనుషులు.. సామాన్యుడికి స్థానికంగా తన చుట్టూ ఉన్న ప్రభుత్వాధికారులు, ఆధిపత్యవర్గాలు వేధించకుండా ఆదాయావకాశాల్ని కల్పించటమే గొప్ప పాలన అని శతాబ్దకాలం ముందే చాటిచెప్పిన గురజాడ లోక్‌సత్తా కొత్త రాజకీయానికి స్ఫూర్తి అని లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరంలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన గురజాడ 154వ జన్మదినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గురజాడ భావాల్ని ఆచరించే రాజకీయం చేయటంతోపాటు గురజాడ గురుతుల్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నందుకు సగర్వంగా ఉందన్నారు. 2012లో గురజాడ కళాభారతి ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరించినా ఇప్పటికీ అది థియేటర్‌గా రూపొందలేదని, ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కలెక్టర్ వివేక్ యాదవ్, తనికెళ్ల భరణి తదితరులు బాబ్జీ తదితరులకు విశిష్ట సన్మానం చేశారు. ◆

## మద్యం వద్దు, మంచినీరివ్వండి

విజయనగరం జిల్లా సీతానగరం మండలం జినమల్లువలస గ్రామంలో మద్యం తప్ప మంచినీరు ఇవ్వటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదని బాబ్జీ విమర్శించారు. గ్రామంలో ఉన్న 600 ఇళ్లకు మంచినీరు అంతర్జాతీయ సమస్యలా మారిందన్నారు. జిల్లా యంత్రాంగం తక్షణం స్పందించి గ్రామానికి రక్షిత మంచినీరు ఏర్పాటు చేయాలని గ్రామ యువతతోపాటు కలెక్టర్‌ని కలిసి కోరారు. జిల్లాలోని గ్రామీణ మంచినీటి సమస్యకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు.

## హయత్‌నగర్ మండలాన్ని యధావిధిగా కొనసాగించాలి

హైదరాబాద్‌కున్న చరిత్ర హయత్‌నగర్‌కుందని, ఈ మండలాన్ని యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ హయత్‌నగర్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షల్లో లోక్‌సత్తా పార్టీ నేత నక్కా సంజీవ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము హాజరై మద్దతు తెలిపారు. జిల్లాలు, మండలాల ఏర్పాటు రాష్ట్రానికి దశ-దిశ ఉండేలా హేతుబద్ధంగా జరగాలని డిమాండ్ చేశారు.

# కొండగుంటూరు యువత కృషి ఆదర్శప్రాయం






రాజమండ్రి గ్రామీణ నియోజకవర్గంలోని కొండగుంటూరు గ్రామాభివృద్ధికి లోక్‌సత్తా పార్టీ నేత మణికుమార్ ఆధ్వర్యంలో యువత చేస్తున్న కృషిని లోక్‌సత్తా పార్టీ నాయకుడు, ఎదుర్లంక ఎంపీటీసీ రాజ్ వర్మ సందర్శించి అభినందించారు. ఎదుర్లంక తరహా సమస్యలే కొండగుంటూరులో ఉన్నాయని, అక్కడి స్థానిక పెద్దల సలహాతో లోక్‌సత్తా యువత సమస్యలకు శాశ్వత పరిష్కారాలను అమలుచేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో అవరోధాలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారన్నారు. ఇక మీదట కొండగుంటూరులో కూడా తన సేవల్ని, సమయాన్ని వినియోగిస్తానని, చేతనైన వనరుల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. విద్య, ఆరోగ్యం, స్థానిక పరిపాలన అంశాల మీద ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలలో కొంత ఆలోచనను పెంచుతూ సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం చేయాలని అన్నారు. విద్యార్థులలో స్ఫూర్తిని నింపే మంచి పుస్తకాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. రాజ్ వర్మతోపాటు బాలానంద కుమార్, బీరా సత్యనారాయణ, స్టాలిన్, పలివెల వెంకన్న తదితర లోక్‌సత్తా నేతలు కొండగుంటూరును సందర్శించినవారిలో ఉన్నారు. ◆

## ఉస్మానియాలో వసతులు దయనీయం, ప్రభుత్వ వైద్య విధాన ప్రక్షాళనే పరిష్కారం





దేశవ్యాప్తంగా ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని రూపాయి సొంత ఖర్చు లేకుండా అందించే నమూనాను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందించిన లోక్‌సత్తా ఆ విధానంపై ప్రజల్లో చైతన్యం కలిగించటం, ప్రభుత్వాసుపత్రుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రయత్నించటంలో భాగంగా వివిధ సర్కారీ దవాఖానాల్ని సందర్శన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ జిల్లాల్లో, హైదరాబాద్‌లో కొన్ని ప్రభుత్వాసుపత్రుల్ని సందర్శించారు. తాజాగా ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి రోగుల సమస్యలు తెలుసుకున్న అనంతరం పార్టీ నేతలు మాట్లాడుతూ, ఉస్మానియాలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని, అధికారులు కూడా ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఒక్కో పడక నిర్వహణకు రూ. 1కోటి వరకూ ఖర్చవుతుండగా, ప్రభుత్వా సుపత్రిలో కేవలం రూ. 8లక్షలే వెచ్చిస్తున్నారని, ఉన్న పడకలకంటే మూడు నాలుగు రెట్లు ఎక్కువ మంది పేషెంట్లకు చికిత్స చేస్తున్నారని, అధికారుల కంటే ప్రభుత్వ విధానాల్లోనే పెద్ద లోపం ఉందని అన్నారు. తక్కువ బడ్జెట్‌తో లోక్‌సత్తా ప్రతిపాదించిన 'అందరికీ ఆరోగ్యం' విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ◆

# విద్యార్థులు పరిష్కార సత్తాని పెంచుకోవాలి: జేపీ







విద్యార్థులు తమ జీవితాల్లో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించుకుని ముందుకు సాగే శక్తిని పెంచుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. వ్యక్తిగత సమస్యలను, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను యువత దీటుగా ఎదుర్కోవాలన్నారు. అసాధ్యం అనుకున్న పెద్దపెద్ద సమస్యలను సులువుగా ఎలా పరిష్కరించుకోవాలో విద్య ద్వారానే నేర్చు కుంటామన్నారు. విద్యను, తద్వారా వచ్చిన విజ్ఞానాన్ని స్వలాభం కోసమే కాకుండా సమాజ అభివృద్ధి కోసం కూడా ఉపయోగించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్ తరాలకు వారధిలాంటి వారన్నారు. హైదరాబాద్‌లో అరోరా రామంతాపూర్, మూసారంబాగ్, ఉప్పల్ పీజీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఉప స్నాతకోత్సవంలో విద్యార్థులకు జేపీ పట్టాలను ప్రదానం చేశారు. సరైన దృక్పథం, క్రమశిక్షణ, నిరంతర కృషితో విద్యార్థులు విజయాన్ని సాధించగలరని ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య ఆర్. నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ప్రళయ్ రీసెర్చి సెంటర్ (ఇమారత్) ప్రాజెక్టు డైరెక్టర్ జె.జగదీశన్, భారతీయ అణువిభాగం విశిష్ట పరిశోధకుడు డా॥ ఎస్. సాయిబాబా, డిప్యూటీ కలెక్టర్ తోట శ్రీవాత్స, అరోరా విద్యాసంస్థల చైర్మన్ నిమ్మటూరి రాజబాబు, కార్యదర్శి నిమ్మటూరి రమేష్ బాబు, అనుదీప్, డైరెక్టర్ ఎం. మాధవి, డాక్టర్ హేమలత, డాక్టర్ బి. మోహన్ కుమార్, శృంగేరి జగద్గురు ఆదిశంకర పీఠం పౌరాణిక విద్వాంసులు సోమసి బాలగంగాధర శర్మ, డాక్టర్ రఘునాగ ప్రభాకర్, శివపార్వతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Posting Date 22-10-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on October 16th 2016

# నిజాలు మాట్లాడుకుందాం-7

## AP పాలకులు ఇప్పటికి కూడా గత అనుభవాల నుండి పాఠం నేర్చుకోవట్లేదు!

1. అధికారాన్ని కేవలం ముఖ్యమంత్రి చుట్టూ కేంద్రీకరించడం.
2. ఆర్థిక అభివృద్ధి కేవలం అమరావతిలో కేంద్రీకరించాలని అనుకోవడం.
3. రాష్ట్రాన్ని కులరాజ్యంగా చేయడం .



**ఇవిచాలు ...రాష్ట్రాభివృద్ధి కుంటుపడడానికి!**

షేర్ చెయ్యండి...ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad